thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 72 | జగిత్యాల | శనివారం | 6 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**అఫ్ఘనిస్తాన్ టెస్టుకు భారత్ సిద్ధం**




11



## వాళ్లవి మాటలు మావి పనులు

### కేసీఆర్ కుట్రల వల్లే పెండింగ్‌లో పథకం

- పాలమూరులో సీఎం రేవంత్ రెండో రోజు సుడిగాలి పర్యటన
- 2027 నాటికి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టీకరణ

.. వివరాలు 2లో



## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్

- నిధులు, నియామకాలు, సాగునీటిలో తీవ్ర వైఫల్యం
- బీజేపీ వైపు ఆశగా చూస్తున్న రాష్ట్ర ప్రజలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

3



# నీ పాలన.. నా పాలనపై చర్చకు సిద్ధమా?

### కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

- డబుల్ ఇండ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి
- ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోట మేం అడుగుతాం
- ఎంపీగా గెలిపిస్తే పాలమూరుకు చేసిందేమిటీ?
- మీకు డిపాజిట్లు వస్తే నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణే నా లక్ష్యం
- కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా బీఆర్ఎస్ నేతల పాపాలు చెరిగిపోవు
- జడ్చర్ల సభలో నిప్పులు చెరిగిన రేవంత్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ పదేళ్ల పాలన, తన రెండున్నరేళ్ల పాలనపై ప్రజల ముందే చర్చకు రావాలని సవాల్ విసిరారు. జడ్చర్లలో నిర్వహించిన ప్రజాపాలన సభలో మాట్లాడిన రేవంత్, 'నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. చర్చలో నేను ఓడితే దేనికైనా సిద్ధం' అని వ్యాఖ్యానించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిన ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగాలని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని ఆయన అన్నారు. 'బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వస్తే నా పేరు మార్చుకుంటా' అంటూ సవాల్ చేశారు. - జడ్చర్ల

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో తీవ్ర నష్టం

### కృష్ణా జలాల్లో ఏపీ వాటా 74 శాతం.. మనది 25 శాతమే

- పగటి పూటే ప్రాజెక్టుల పంపులు నడపడం దారుణం
- రైతు డిస్కం ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి
- సీఎం రేవంత్ కు హరీశ్ రావు బహిరంగ లేఖ

3



## రూ. 1600 కోట్ల బొగ్గు స్కాం!

- 40 లక్షల టన్నుల నిల్వలు మాయం చేసిన సీఎం రేవంత్
- విచారణ జరపాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ

3



## ఎనిమిది మంది చిన్నారుల జలసమాధి

- వేర్వేరు ఘటనల్లో చిన్నారుల దుర్మరణం
- కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విషాదం
- బోలక్‌పల్లి మంజీర తీరంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు..
- లింబాద్రిగుట్ట మీపంలోని కుంటలో మునిగి మరో ముగ్గురు
- జడ్చర్ల కిష్టంపల్లి చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు

3



కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో శుక్రవారం వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఎనిమిది మంది నీట మునిగి జలసమాధి అయ్యారు. పండుగ సంబరాలు, సరదాగా ఆడుకోవడానికి వెళ్లిన సమయాల్లో జరిగిన ఈ ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.



## రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

- పుప్పాలగూడ-ఖాజాగూడలో హైడ్రా భారీ ఆపరేషన్
- 200 ఎకరాల విలువైన హెచ్ఎండీఏ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు
- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి రెవెన్యూ, మున్సిపల్, హైడ్రా
- చరిత్ర కలిగిన అరుదైన చారిత్రక రాతిగుట్టల పరిరక్షణ
- ప్రభుత్వ చర్యలపై పర్యావరణ సంస్థల నుంచి హర్షం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైడ్రా నగర శివార్లలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ ఆపరేషన్ చేపట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో దశాబ్దాలుగా ఆక్రమణల ముప్పులో ఉన్న సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు.

.. వివరాలు 2లో

## కాక్రోచ్ జనతా పార్టీ నిరసనపై పిల్

### తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ




.. వివరాలు 4లో




## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు

2

### గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా

## రాహుల్ గాంధీ ఆన్‌లైన్ క్యాంపెయిన్!

కేంద్ర ప్రభుత్వ రూ. 80 వేల కోట్ల మెగా ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు
ఆన్‌లైన్ సంతకాల సేకరణకు పిలుపు



.. వివరాలు 4లో



# రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

**పుప్పాలగూడ-ఖాజాగూడలో హైడ్రా భారీ ఆపరేషన్**

**200 ఎకరాల విలువైన హెచ్‌ఎండీఏ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు**

**హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి రెవెన్యూ, మున్సిపల్, హైడ్రా**

**ప్రభుత్వ చర్యలపై పర్యావరణ సంస్థల నుంచి హర్షం**



**హైదరాబాద్, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైడ్రా నగర శివార్లలో అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ ఆపరేషన్ చేపట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దుల్లో దశాబ్దాలుగా ఆక్రమణల ముప్పులో ఉన్న సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ (కంచె) ఏర్పాటు చేసి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. గత కొంతకాలంగా ఈ భూములపై నెలకొన్న వివాదాలు, పర్యావరణవేత్తల పిటిషన్లను పరిశీలించిన గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. హైడ్రా నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలనలు జరిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సదరు సర్వే నంబర్లలో మొదట 293 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. వివిధ ప్రభుత్వ కేటాయింపులు, కోర్టు వివాదాల అనంతరం ప్రస్తుతం 200 ఎకరాల భూమి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (ఎవీణూా) పరిధిలో మిగిలి ఉన్నట్లు అధికారులు గుర్తించి, వాటి సరిహద్దులను ఖరారు చేస్తూ రక్షణ చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలోని చారిత్రక రాతిగుట్టలు, సహజ శిలా నిర్మాణాల పరిరక్షణ కోసం పర్యావరణ సంస్థలు దశాబ్దాలుగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నాయి. పర్యావరణ, భౌగోళిక నిపుణుల అంచనా ప్రకారం.. ఇక్కడి రాతిగుట్టలకు సుమారు 250 కోట్ల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ అరుదైన శిలా నిర్మాణాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే ఒక విశిష్టమైన భౌగోళిక వారసత్వ సంపదగా నిపుణులు గుర్తింపునిచ్చారు. హైడ్రా తీసుకున్న ఈ తాజా నిర్ణయం వల్ల ఈ ప్రకృతి వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించే అవకాశం లభించిందని పర్యావరణ నిపుణులు కొనియాడారు. హైడ్రా చేపట్టిన ఈ మెగా డ్రైవ్‌ను పర్యావరణ సంస్థల ప్రతినిధులు, నగరవాసులు ఏకగ్రీవంగా స్వాగతించారు. సహజసిద్ధమైన కొండలు, పచ్చదనాన్ని కాపాడటం ద్వారా ఇక్కడ సాగుతున్న అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేశారు. దీనికి తోడు, ఈ రాతిగుట్టల పరిసర ప్రాంతానికి అత్యంత సమీపంలో ఉన్న 'భగీరథమ్మ చెరువు' పునరుద్ధరణ పనులు కూడా ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎత్తైన కొండలు, సహజసిద్ధమైన అరుదైన రాతి శిలలు, పక్కనే ఉన్న జలాశయం కలయికతో ఈ ప్రాంతం భవిష్యత్తులో హైదరాబాద్ నగరంలోనే ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా (జుఎశీ-ఽశీబతీఱంఎ ఎబఎ) విరాసిల్లేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని స్థానికులు, పర్యావరణవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రకృతి సంపదను కాపాడటంలో హైడ్రా చూపిన ఈ చొరవ అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

**ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు**

**హైదరాబాద్, జూన్ 5:** హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.




# నీ పాలన.. నా పాలనపై చర్చకు సిద్ధమా?

- కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్
- డబుల్ ఇండ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి
- ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోట మేం అడుగుతాం
- ఎంపీగా గెలిపిస్తే పాలమూరుకు చేసిందేమిటి?
- మీకు డిపాజిట్లు వస్తే నా పేరు మార్చుకుంటా
- నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణే నా లక్ష్యం
- కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా బీఆర్ఎస్ నేతల పాపాలు చెరిగిపోవు
- జడ్చర్ల సభలో నిప్పులు చెరిగిన రేవంత్



**ఉద్యమ కెరటం, జడ్చర్ల :** "నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? నీ పేరు కేసీఆర్ అయితే అసెంబ్లీకి రా.. ఈ చర్చలో నేను ఓడిపోతే దేనికైనా సిద్ధం" అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని, బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, ప్రజావ్యతిరేక పాలనపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పాలమూరు గడ్డపై ఇకపై బీఆర్ఎస్ గుర్తు మాయం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ నేతలకు నోరు తెరిస్తే అబద్ధాలేనని మండిపడిన సీఎం, ఇళ్ల నిర్మాణాలపై ఆ పార్టీకి సూటి సవాల్ విసిరారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట వారు ఓట్లు అడగాలని, తాము ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ప్రతి ఊరిలో ఓట్లు అడుగుతామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పాలమూరులో బీఆర్ఎస్‌కు కనీసం డిపాజిట్లు వస్తే తన పేరు మార్చుకుంటానని కుండబద్దలు కొట్టారు. కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా బీఆర్ఎస్ నేతల పాపాలను ప్రజలు మరిచిపోరని, మేకవన్నె పులి లాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని ఎద్దేవా చేశారు.

**పాలమూరును కేసీఆర్ దగా చేశారు!**

కరీంనగర్ నుంచి రాజకీయ వలస వచ్చిన కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఎంపీగా గెలిపిస్తే, ఆయన కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎంపీగా గెలిచి తెలంగాణ తెచ్చానని చెప్పుకునే కేసీఆర్, రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయకుండా ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును వదిలేసి, గజ్వేల్‌కు పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక జిల్లా అభివృద్ధి కోసం రాత్రింబగళు శ్రమిస్తున్న తాను ద్రోహిని అవుతారా? అని నిలదీశారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు 'కూలేశ్వరం'గా మారిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి హామీలను ఇచ్చి కేసీఆర్ కుటుంబం ప్రజలను దగా చేసిందని, కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలాలనుకోవడం ముగిసిన అధ్యాయమన్నారు.

**డిసెంబర్‌కల్లా 90 టీఎంసీల నీటి సాధనే లక్ష్యం**

తాను పాలమూరు బిడ్డగా గత రెండు రోజులుగా జిల్లాలోని సాగునీరు ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ జిల్లాలో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పెండింగ్ ప్రాజెక్టుల పునరుద్ధరణే తన లక్ష్యమన్నారు. పాలమూరు ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల కాలంలోనే 8000 కోట్లు ఖర్చు చేశామని, డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని సాధిస్తామని ప్రకటించారు. జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నీటి సమస్యల పరిష్కారానికి పక్క రాష్ట్రాలతో చర్చలు జరుపుతామంటే బీఆర్ఎస్ నేతలు బురద జల్లుతున్నారని, ప్రజా హితం కోసం ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపి తీరుతామని స్పష్టం చేశారు.

**పాలమూరులో ఎడ్యుకేషన్ హబ్..**

గత పాలకులు జైళ్లు కట్టాలని చూస్తే, తాము స్కూళ్లు కట్టాలని భావించామని సీఎం పేర్కొన్నారు. పిల్లలు ఏ ఉన్నత చదువు చదవాలన్నా పాలమూరు జిల్లాకే వచ్చేలా కొడంగల్‌లో భారీ 'ఎడ్యుకేషన్ హబ్' నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. చదువొక్కటే పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, బతుకులు బాగుపడాలంటే పిల్లలను బాగా చదివించాలని పిలుపునిచ్చారు. 2006లో మిడ్జిల్ నుంచి జెడ్పీటీసీగా తనను గెలిపించి ప్రజలు నాటిన మొక్కే, ఇవాళ వృక్షమై రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మీ ముందు నిలిచిందని భావోద్వేగానికి లోనయ్యారు. పాలమూరు ప్రజలకు కేవలం మట్టి తీసుడే కాదు, అన్యాయం చేసిన వారిని మట్టితో కప్పడం కూడా తెలుసని హెచ్చరించారు. ' రాష్ట్రంలో కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులను పేదలకు అందించాం.. సొంత ఇంటి కల సాకారం చేస్తూ 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం.. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ అండగా నిలిచాం.. మహిళల ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం (మహాలక్ష్మి పథకం) కోసం ఏకంగా పది వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం' అని చెప్పారు. "ఇలా మేం చేసిన అభివృద్ధిని చెప్పాలంటే రాయడానికి రామాయణం, చెప్పడానికి భారతం అవుతుంది. ధైర్యముంటే నీ పదేళ్ల పాలనపై అసెంబ్లీకి వచ్చి చర్చించు" అని కేసీఆర్‌కు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారమని, 2029లో మళ్లీ భారీ మెజారిటీతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ భారీ బహిరంగ సభలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్థానిక శాసనసభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# వాళ్లవి మాటలు.. మావి పనులు!

- కేసీఆర్ కుట్రల వల్లే పెండింగ్ లో పథకం
- కృష్ణా, గోదావరి జలాల్లో చుక్క నీరూ వదులుకోం!
- డిసెంబర్ నాటికి కృష్ణా నీటి వివాదాలకు పరిష్కారం
- 30 నెలల్లో మేం చెల్లించిన అప్పు రూ. 52 వేల కోట్లు
- బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరిట వేల కోట్ల కమీషన్లు
- పాలమూరులో సీఎం రేవంత్ రెండో రోజు సుడిగాలి పర్యటన
- 2027 నాటికి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టీకరణ




**ఉద్యమ కెరటం, మహబూబ్ నగర్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్ లోనే ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరగలేదన్నారు. భూసేకరణ చేయకుండా గత ప్రభుత్వ హయాంలో నిధులను పంపులు, లిఫ్ట్‌లకే ఖర్చు చేశారన్నారు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ఏళ్లుగా పోరాడారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి రూ. 84,503 కోట్ల అప్పు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 30 నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ. 52,121 కోట్లు చెల్లించామని రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వీటిలో రూ. 8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే ఇచ్చామన్నారు. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే మరో 4వేల ఎకరాల భూసేకరణ చేయాలని, భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా అని ప్రశ్నించారు. రాబోయే రెండేళ్లలో (2027 నాటికి) గరిష్టస్థాయిలో ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని సీఎం స్పష్టం చేశారు. రైతులు అడుగుతున్న ధర కాస్త ఎక్కువైనప్పటికీ భూసేకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. పనులు పూర్తి చేయకపోతే చరిత్ర క్షమించదని, రిజర్వాయర్లకు సంబంధించి ఆగిపోయిన పనులను కూడా పునరుద్ధరిస్తామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేదని సీఎం అన్నారు. రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసి కేవలం పంపులు, లిఫ్ట్ పనులు పూర్తి చేసి, ఆ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిపించుకున్నారని ఎద్దేవా చేశారు. కానీ ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు 90 టీఎంసీల నీటిని అందించగలిగితే అత్యంత కీలకమైన పాలమూరు ఉ రంగారెడ్డి పథకం గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాపై కోపంతోనే మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని ఆరోపించారు. గోదావరి జలాల్లో 968 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉన్నాయని, ఈ జలాల విషయంలో చుక్క నీటి విషయంలో కూడా రాజీపడే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ పునరుద్ఘాటించారు. వచ్చే డిసెంబర్ నాటికి కృష్ణా జలాలపై ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఆఖరు నిమిషం వరకు పోరాడతామని స్పష్టం చేశారు. పక్క రాష్ట్రాలతో పంచాయతీలు కోరుకోవడం లేదని, పరిష్కారమే కావాలన్నారు. గోదావరి, కృష్ణా జలాల్లో చుక్క నీరు వదులుకోమని తేల్చిచెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ఉ చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టడానికి మహారాష్ట్రతో సంప్రదింపుల ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాలో రెండో రోజు సుడిగాలి పర్యటన చేశారు. పాలమూరు ఉ రంగారెడ్డి కింద రిజర్వాయర్లు, వివిధ ప్యాకేజీల పనులను పరిశీలించారు. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్, ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్ తదితర ప్రాంతాలను సందర్శించారు. పీఆర్ ఎల్ ఐఎస్ టన్నెల్ లోపలికి 1.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఆ తర్వాత హెలికాప్టర్ లో భూత్పూర్ మండలం కొత్తూరు చేరుకుని కరివెన రిజర్వాయర్ పనులను పరిశీలించారు. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్ చేరుకుని ప్యాకేజీ 17, 18 పనులను పరిశీలించారు.

# భూకబ్జా కేసులో వైసీపీ నేత అరెస్ట్!

**హైదరాబాద్, జూన్ 5 :** గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, ఏపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈడబ్ల్యూఓ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ లో శుక్రవారం తమిళనాడులోని కాంచీపురంలో బ్రహ్మనాయుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ కు తీసుకొచ్చారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నంబర్ 18లో సుమారు పది ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బొల్లా బ్రహ్మనాయుడు కుట్ర పన్నాడు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించాడు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగి పోలీస్ స్టేషన్ లో బ్రహ్మనాయుడు సహా పలువురిపై క్రైమ్ నంబర్ 990/2026గా కేసు నమోదు చేశారు. ఈ భూమి కబ్జా కోసం రూ. 12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ. 4 కోట్లు, రాధాకృష్ణకు రూ. 4 కోట్లు, ఇతరులకు మరో రూ. 4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్ ను పోలీసులు గతంలోనే అరెస్ట్ చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగంతో పాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్ ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు అజ్ఞాతంలోకి వెళ్లాడు. అతడి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. చివరికి కాంచీపురంలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్

- నిధులు, నియామకాలు, సాగునీటిలో వైఫల్యం
- బీజేపీ వైపు ఆశగా చూస్తున్న రాష్ట్ర ప్రజలు
- డబుల్ ఇంజిన్ తోనే అభివృద్ధి!
- ఆధునిక సాంకేతికతను కార్యకర్తలు వాడుకోవాలి
- శిక్షణా తరగతుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు


బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి

**మహబూబాబాద్, జూన్ 5:** రాష్ట్ర అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కారు ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మహబూబాబాద్ లో జరిగిన బీజేపీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముందుగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో తీవ్ర వైఫల్యాలు జరిగాయని రామచందర్ రావు విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అవినీతి, నిర్లక్ష్యంతోనే పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని గుర్తుచేశారు. దేశంలో 2014 తర్వాత సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకెళ్తోందని ఆయన వివరించారు. బీజేపీ కార్యకర్తలు కృత్రిమ మేధస్సు, సామాజిక మాధ్యమాల వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవాలని రామచందర్ రావు సూచించారు. సాంకేతికతతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన పన్నెండు అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ చేరవేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు.

# చేతకాకపోతే రాజీనామా చేయ్!

- రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కారు విఫలం
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో సర్కారు చేతగానితనం
- దొంగ ఇసుక రవాణాకు లారీలుంటాయి.. ధాన్యానికి దొరకవా?
- బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామనడం దారుణం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎంపీ ధర్మపురి అర్వింద్ ఫైర్



**హైదరాబాద్, జూన్ 5:** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అర్వింద్ మండిపడ్డారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదన్నారు. వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్రంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత ఎందుకు వస్తుందని అర్వింద్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై స్పందిస్తూ.. ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఎనిమిది మంది చిన్నారుల జలసమాధి

### వేర్వేరు ఘటనల్లో చిన్నారుల దుర్మణం

### కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విషాదం

**బాన్సువాడ రూరల్/భీమ్‌గల్/జడ్చర్ల టౌన్, జూన్ 5 :** తెలంగాణలోని కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో శుక్రవారం వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఎనిమిది మంది నీట మునిగి జలసమాధి అయ్యారు. పండుగ సంబరాలు, సరదాగా ఆడుకోవడానికి వెళ్లిన సమయాల్లో జరిగిన ఈ ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కిష్టాపూర్‌కు చెందిన పండరి అనే వ్యక్తి బోలక్‌పల్లి శివారులోని మంజీర నది వద్ద శుక్రవారం తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఎల్లమ్మ పండుగ నిర్వహించారు. పండుగ ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో పండరి కుమార్తె పవనశ్రీ (15), సోదరి అనిత (35), ఆమె కూతురు శివాని (13)లతో పాటు భానుప్రసాద్, సుషాంత్ సరదాగా మంజీర నది వద్దకు వెళ్లారు. అక్కడ ఒకరు ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోగా, వారిని కాపాడేందుకు ఒకరి వెనుక ఒకరు నీటిలోకి దూకారు. వారంతా మునిగిపోతూ కేకలు వేయడంతో మిగతా కుటుంబ సభ్యులు పరుగున వచ్చి వారిని నీటి నుంచి బయటకు తీసి, అంబులెన్స్‌లో బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అనిత, శివాని, పవనశ్రీ అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. అపస్మారక స్థితిలో ఉన్న భానుప్రసాద్, సుషాంత్‌కు అత్యవసర వైద్యం అందించడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు.

### ఆడుకుంటూ వెళ్లి.. కుంటలో పడి..

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లింబాద్రి గుట్ట సమీపంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. ఒడ్డెర కాలనీకి చెందిన ద్యారంగుల సురేశ్ కుమారుడు అరవింద్ (4), కంది మహేశ్ కూతురు వర్షిణి (5), కుమారుడు హరీశ్ (10) శుక్రవారం ఉదయం ఆడుకుంటూ సమీపంలోని బ్రాహ్మణ కుంట వద్దకు వెళ్లారు. ఇంటి నుంచి వెళ్లిన పిల్లలు ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అటవీ ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజఈతగాళ్ల సహాయంతో బ్రాహ్మణ కుంటలో గాలించగా ముగ్గురు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలతో పాటు మరో చిన్నారి మరణించడంతో కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

### ఈత రాక ఎర్రచెరువులో ఇద్దరు బాలుర..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డకు చెందిన సోహెల్ (14), అబ్దుల్ రెహమాన్ (15) అనే ఇద్దరు బాలురు మరో ఇద్దరు మిత్రులతో కలిసి పట్టణ శివారులోని కిష్టంపల్లి గ్రామ ఎర్రచెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సోహెల్, అబ్దుల్ రెహమాన్‌లకు ఈత రాకపోవడంతో లోతు తెలియక కాలుజారి నీటిలో మునిగిపోయారు. ఇది గమనించిన తోటి మిత్రులు వెంటనే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలించి ఇద్దరు బాలుర మృతదేహాలను బయటకు తీశారు. కళ్ల ముందే పిల్లలు శవాలుగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతోనే అగ్నిప్రమాదం

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్

**హైదరాబాద్, జూన్ 5 :** అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను కల్వకుంట్ల కవిత శుక్రవారం సందర్శించారు. ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత వ్యాపారులు మాట్లాడుతూ భవనంలో ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని గత కొంతకాలంగా సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, ఈ అగ్నిప్రమాదం ఆకస్మికంగా జరిగిన ఘటన కాదని పేర్కొన్నారు. భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు చోటుచేసుకున్నాయని బాధితులు తెలిపారని చెప్పారు. మూడు నెలలుగా ప్రమాద హెచ్చరికలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించిన కవిత, ప్రమాదంలో సుమారు రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. అనేక కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా ఆలస్యంగా సంఘటనా స్థలానికి చేరుకోవడం బాధాకరమని అన్నారు. సరైన సమయంలో స్పందించి ఉంటే నష్టం మరింత తగ్గే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అవసరమైన అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, భారీ భవనాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో తీవ్ర నష్టం

### కృష్ణా జలాల్లో ఏపీ వాటా 74 శాతం.. మనది 25 శాతమే

### పగటి పూటే ప్రాజెక్టుల పంపులు నడపడం దారుణం

### వెంటనే రైతు డిస్కం ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

### సీఎం రేవంత్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ



**హైదరాబాద్, జూన్ 5:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయిందని, రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును ప్రభుత్వం ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ, జలాల వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం గాయత్రి పంపింగ్ స్టేషన్ తో పాటు దేవాదుల తదితర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు, మోటార్లు దెబ్బతిన్నాయని హరీశ్ రావు తెలిపారు. భారీ మోటార్లను పదేపదే ఆన్-ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని ఏప్రిల్ ఏడో తేదీనే తాము హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన మౌలిక వసతులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను ఉద్దేశపూర్వకంగా బలహీనపరిచి ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారా అన్న అనుమానం కలుగుతోందని ఆయన లేఖలో నిలదీశారు. సోలార్ విద్యుత్ అందుబాటులో ఉండే పగటి వేళల్లోనే పంపులు నడపాలని ట్రాన్స్ కో సూచించడం వల్ల, భారీ మోటార్లను తరచూ ఆన్, ఆఫ్ చేయాల్సి వస్తోందని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలకు ముందు అసలు సాంకేతిక అధ్యయనం జరిగిందా లేదా అని ప్రశ్నించారు. జీవో నెంబర్ ఎనిమిది ద్వారా రైతు డిస్కంకు కేవలం పగటిపూట మాత్రమే ఉండే సోలార్ విద్యుత్ ను కేటాయించడం వల్ల పంపింగ్ కార్యకలాపాలు పరిమిత సమయానికే కట్టుబడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల కృష్ణా, గోదావరి జలాల వినియోగ సామర్థ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. విద్యుత్ లభ్యత ఆధారంగా పంపింగ్ ను పరిమితం చేయడం రాష్ట్ర జల హక్కులకు విరుద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల వినియోగం కనిష్ట స్థాయికి పడిపోయిందని హరీశ్ రావు మండిపడ్డారు. తెలంగాణకు కేటాయించిన తాత్కాలిక వాటా 34 శాతం కాగా, ఏపీకి 66 శాతం ఉందన్నారు. అయితే 2024-25లో ఏపీ 72.73 శాతం నీటిని వినియోగించగా, తెలంగాణ కేవలం 27.27 శాతం మాత్రమే వినియోగించిందని లెక్కలు వివరించారు. ఇక 2025-26లో ఏపీ వినియోగం 74.90 శాతానికి పెరగగా, తెలంగాణ వాటా చారిత్రక కనిష్టమైన 25.10 శాతానికి పడిపోయిందని దుయ్యబట్టారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ రాష్ట్రం తన వాటాను పూర్తిగా వాడుకోలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పంపింగ్ సీజన్లో 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వెంటనే రైతు డిస్కం ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం, దేవాదుల తదితర ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునీకరణకు బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్ర జల హక్కులను సమర్థవంతంగా కాపాడాలని ఆయన లేఖలో కోరారు.

# సింగరేణిలో రూ. 1600 కోట్ల బొగ్గు స్కాం!

### 40 లక్షల టన్నుల నిల్వలు మాయం చేసిన సీఎం రేవంత్

### విచారణ జరపాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ



**హైదరాబాద్, జూన్ 5:** సింగరేణిలో జరిగిన రూ. 1600 కోట్ల భారీ కుంభకోణంపై వెంటనే విచారణ జరపాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి సంస్థ ప్రకటించిన నిల్వల నుంచి సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు ఎలా మాయమైందని ఆయన ప్రశ్నించారు. ఈ బొగ్గును రేవంత్ రెడ్డి మాయం చేశారని, స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు. రూ. 1600 కోట్ల విలువ చేసే బొగ్గు ఏమైందో వెంటనే తేల్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ గా మారిందని కేటీఆర్ విమర్శించారు. నైనీ కుంభకోణం నుంచి మొదలుకొని వందల అక్రమాలు జరుగుతున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. నిల్వలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ కానీ, కాగ్ అధికారులు కానీ ఇప్పటిదాకా ఎందుకు తనిఖీలు చేపట్టలేదని నిలదీశారు. సింగరేణి బొగ్గు తెలంగాణ ప్రజల ఆస్తి అని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంస్థ మనుగడనే దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి కుమ్మక్కు కాకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిలపక్షాన్ని గనుల వద్దకు పంపాలని డిమాండ్ చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక ప్రపంచంలో భూమాతను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత రోజురోజుకూ పెరుగుతోందని స్పష్టం చేశారు. ఈ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరిగిన అద్భుతమైన హరిత విప్లవాన్ని గుర్తుచేసుకుందామని పిలుపునిచ్చారు. హరితహారం ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా 290 కోట్లకు పైగా మొక్కలు నాటిందని వివరించారు. అర్బన్ ఫారెస్ట్ పార్కులు, థీమ్ పార్కులు, పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు లాంటి ఎన్నో అద్భుతాలను సృష్టించిందని గుర్తుచేశారు. 2015 నుంచి 2021 మధ్య కాలంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్ల నుంచి 21,214 చదరపు కిలోమీటర్లకు పెరిగిందని వెల్లడించారు. అంటే 6.85 శాతం అటవీ విస్తీర్ణం పెరగ్గా, మొత్తం పచ్చదనం 7.7 శాతం పెరిగిందన్నారు. దేశం మొత్తం పచ్చదనం కేవలం 0.22 శాతం (1,540 చదరపు కిలోమీటర్లు) మాత్రమే పెరిగితే, ఒక్క తెలంగాణలోనే 3.07 శాతం (632 చదరపు కిలోమీటర్లు) పచ్చదనం పెరిగిందని గణాంకాలు వివరించారు.



# పర్యావరణ పరిరక్షణ మాటల్లోనేనా?

## ఫొటోలకే పరిమితమైన వేడుకలు
## మారుతున్న వాతావరణం
## జనాభా శాపం - ప్రకృతి దోపిడీ
## కలుషితమైన జీవనదులు

**ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్యసమితి 1972లో స్వీడన్ సమ్మేళనంలో 119 దేశాల భాగస్వామ్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజల్లో అవగాహన కల్పించడమే. అయితే, ఏటా ఈ పర్వదినం రాగానే పాలకులు మొక్కలు నాటడం, సైకిళ్లు తొక్కడం, ఫొటోలకు పోజులివ్వడం వంటి హడావిడి చేస్తున్నారే తప్ప, పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధితో కఠిన చట్టాలను అమలు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకుల ఈ విధ్వంసకర, నిర్లక్ష్య వైఖరి వల్లే నేడు భారతదేశంలో పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది.**

### ఉత్పాతంలా మారుతున్న వాతావరణం

బాధ్యతారహితమైన మానవ చర్యల వల్ల వాతావరణంలో ఎల్‌నినో వంటి తీవ్రమైన సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఒకప్పుడు జూన్ మాసం రాకముందే దేశంలో జోరు వానలు పడేవి; కానీ నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. ఈ యేడు కూడా నైరుతి రుతుపవనాలు అత్యంత ఆలస్యంగా ప్రవేశించాయి, ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతూనే ఉంది. పెరుగుతున్న జనాభా తమ స్వార్థ అవసరాల కోసం ప్రకృతిని యథేచ్ఛగా దోచుకోవడమే దీనికి ప్రధాన కారణం. ఊరూరా చెరువులను మింగేయడం, ఇసుక-మట్టిని తోడేయడం, అడవులను నరికివేస్తూ కొండలను ఆనవాళ్లు లేకుండా చేయడంతో పర్యావరణ విధ్వంసం పరాకాష్ఠకు చేరింది. అడవుల నాశనంతో చిరుతలు, పెద్దపులులు జనావాసాల్లోకి వచ్చి పడుతుండటం వన్యప్రాణుల మనుగడ సంక్షోభాన్ని కళ్లకడుతోంది.

### సంస్కృతిని మరిచాం.. పంచభూతాలను కలుషితం

మన పూర్వీకులు, భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యుడిగా, జలాన్ని దేవిగా, నదులను జీవనదాయిని అయిన మాతలుగా కొలిచారు. అందుకనే ప్రాచీన నాగరికతలన్నీ నదీతీరాల వెంబడే ఉద్భవించాయి. ప్రకృతిని రక్షించుకోవాలనే ఉద్దేశంతోనే మన సంస్కృతిలో రావి, మర్రి, తులసి, మామిడి, అరటి వంటి వృక్షాలను పూజించే ఆచారం తెచ్చారు. హోలీ, దీపావళి, సంక్రాంతి, జన్మాష్టమి వంటి పండుగలన్నీ ప్రకృతి సౌందర్యాన్ని, ఋతువుల ప్రాధాన్యతను తెలియజేసేవే. కానీ నేడు బాహ్య, అంతర్గత పర్యావరణాల మధ్య ఉన్న అనుబంధాన్ని మనుషులు మర్చిపోయారు. అవసరానికి మించిన భౌతిక, రసాయనిక పదార్థాలు గాలిలో, నీటిలో చేరడం వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడి తీవ్ర కాలుష్యం సంభవిస్తోంది.

### తరిగిపోతున్న స్వచ్ఛమైన నీరు.. పెరిగిపోతున్న వ్యర్థాలు

భూగోళంపై 80 శాతం జలం విస్తరించి ఉన్నప్పటికీ, తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీటి లభ్యత కేవలం 3 శాతం కంటే తక్కువగానే ఉంది. మిగిలిన నీరంతా ఉప్పునీరు లేదా కలుషిత నీరుగా ఉంది. మనం తల్లిగా భావించి పూజించే గంగ, యమున, గోదావరి వంటి పవిత్ర నదులు నేడు నివాస ప్రాంతాల వ్యర్థాలు, పరిశ్రమల విషతుల్య రసాయనాల వల్ల పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. దీనివల్ల కేవలం మనుషులే కాక జలచరాలు, సమస్త ప్రాణికోటి నశిస్తోంది. మరోవైపు పట్టణీకరణ, వాహనాల పొగతో వాయు కాలుష్యం పెరిగి ప్రాణవాయువు (ఆక్సిజన్) శాతం పడిపోతోంది. మన దేశంలో ప్రతిరోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో వందల సంవత్సరాలైనా భూమిలో కలవని ప్లాస్టిక్ వ్యర్థాలు భూసారాన్ని నశింపజేస్తున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల ఎన్నో పశుపక్ష్యాదులు ప్రాణాలు విడుస్తున్నాయి.

### నైతిక బాధ్యతగా భావించాలి

పెరుగుతున్న జనాభా, తరుగుతున్న భూ ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ముప్పుగా పరిణమించాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించి నదులను, భూగర్భ జలాలను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. నగరాలు, పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, వాయు, భూ కాలుష్యాలను అరికట్టడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. పాలకుల విధానాల్లో మార్పు రావడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలో కఠినమైన చట్టాలను రాజీ లేకుండా అమలు చేసినప్పుడే ఈ భూమిపై రాబోయే తరాలకు జీవించే హక్కు దక్కుతుంది.

# కాక్రోచ్ జనతా పార్టీ నిరసనపై పిల్

### తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ




**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై తక్షణ విచారణ చేపట్టేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ప్రజా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రభుత్వ మౌలిక వసతుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరింది. నిరసన కార్యక్రమానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో ప్రచారం జరుగుతోందని, పెద్ద సంఖ్యలో యువతను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రచారంలో ఉన్న కొన్ని సందేశాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, భద్రతా బలగాల విధులకు ఆటంకం కలిగించే అంశాలు కూడా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిటిషనర్ వాదించింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరింది. ఈ విషయమై ఇప్పటికే ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సంప్రదించినప్పటికీ స్పందన లభించలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో చివరి మార్గంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపింది. అయితే, పిటిషన్‌ను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై తక్షణ విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అత్యవసర విచారణకు నిరాకరించింది. దీంతో ఈ వ్యవహారం తదుపరి విచారణకు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాహుల్ ఆన్‌లైన్ క్యాంపెయిన్!



### కేంద్ర ప్రభుత్వ రూ. 80 వేల కోట్ల మెగా ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు

### దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ సంతకాల సేకరణకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ అగ్రనేత

**న్యూఢిల్లీ:** అండమాన్, నికోబార్ దీవులలోని గ్రేట్ నికోబార్ దీవిని ఒక వ్యూహాత్మక, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' ఇప్పుడు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు 80 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష పార్టీలు మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సరికొత్తగా ఆన్‌లైన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల గ్రేట్ నికోబార్ దీవిలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా ఛ+తీవవఆజవతీ+తీవవం, ఛచీఅఎశీఝతీమీఞవతీం వంటి హ్యాష్‌ట్యాగ్స్‌తో దేశవ్యాప్త సంతకాల సేకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ పనుల కారణంగా నికోబార్ దీవుల్లో స్కూబా డైవింగ్‌తో పాటు ఇతర నిర్మాణ కార్యకలాపాల వల్ల అక్కడి అరుదైన పగడపు దిబ్బలు (కోరల్ రీఫ్స్) తీవ్రంగా విధ్వంసం అవుతున్నాయంటూ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏంటి ఈ గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్?

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రేట్ నికోబార్ దీవిలో పలు కీలక మౌలిక వసతుల నిర్మాణాలు జరగనున్నాయి. అందులో ముఖ్యంగా అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, భారీ విద్యుత్ ఉత్పాదన కేంద్రం, ఒక అత్యాధునిక టౌన్‌షిప్ నిర్మాణం, భారత ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఈ ప్రాజెక్ట్ ఎంతో కీలకమని ప్రభుత్వం భావిస్తుండగా, పర్యావరణాన్ని పణంగా పెట్టి ఈ ప్రాజెక్ట్ చేయవద్దంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు తమ నిరసనను ఉధృతం చేస్తున్నాయి.

# భారత్‌పై పుతిన్ ప్రశంసలు

### విదేశాంగ విధానానికి మద్దతు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ రాజకీయాల్లో భారత్ స్వతంత్ర వైఖరితో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ దేశానికి ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వార్తా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై బాహ్య ఒత్తిళ్లు తీసుకురావాలనే ప్రయత్నాలు గతంలో జరిగినప్పటికీ అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పుతిన్ అన్నారు. ముఖ్యంగా రష్యాతో సంబంధాల విషయంలో భారత్ తన స్వతంత్ర నిర్ణయాలను కొనసాగించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఏ దేశంపైనా ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదని, అలాంటి చర్యలు ప్రపంచ స్థాయి దౌత్య సంబంధాలను బలహీనపరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నిరంతరం పెరుగుతున్నాయని, రాబోయే కాలంలో ద్వైపాక్షిక వాణిజ్య విలువ వంద బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధనం, పరిశ్రమలు, సాంకేతికత, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్ వంటి పెద్ద దేశంపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు ఆ చర్యలకు పాల్పడే దేశాలకే ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చని పుతిన్ హెచ్చరించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి దేశంతో సంబంధాలను దెబ్బతీయడం అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రభావాలను కలిగిస్తుందని అన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా దేశాల మధ్య సంబంధాలు కొనసాగాలని సూచించారు. భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తోందని పుతిన్ అభిప్రాయపడ్డారు. భారత్‌తో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహబంధం భవిష్యత్తులో కూడా మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం కొత్త స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

# సంక్షోభం.. సానుకూలంగా!

- టీఎంసీలో తిరుగుబాటు.. మమతకు పెరుగుతున్న ఇబ్బందులు
- కాంగ్రెస్‌పై డీఎంకే అసంతృప్తి.. మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఇదే సరైన సమయంగా భావిస్తున్న బీజేపీ
- డీలిమిటేషన్ బిల్లుపై ఫోకస్ పెంచిన కేంద్రం
- ప్రత్యేక మెజారిటీ కోసం ప్రాంతీయ పార్టీల మద్దతుపై ఆశలు



**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రతిపక్షాల ఇండియా కూటమిలో విభేదాలు పెరుగుతుండగా, కొన్ని కీలక ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న సంక్షోభాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకెళ్లేందుకు ఇదే సరైన సమయమని కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయనే వార్తలు వస్తున్నాయి. మమతా బెనర్జీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతల సంఖ్య పెరుగుతోందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అదే సమయంలో పార్టీ ఎంపీల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయనే ప్రచారం కొనసాగుతోంది. మరోవైపు తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే చల్లబడినట్లు రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికల అనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌పై డీఎంకేలో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులను బీజేపీ నిశితంగా గమనిస్తున్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశం కావడంతో పార్లమెంటులో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. గతంలో సంఖ్యాబలం కొరత కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల్లో ఏర్పడుతున్న విభేదాలు, మారుతున్న రాజకీయ సమీకరణాలు తమకు కలిసొస్తాయని బీజేపీ అంచనా వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ స్థానాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ అమలుకు కూడా డీలిమిటేషన్ కీలకంగా మారనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించినట్లు సమాచారం. 2029లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

చురకలు

శనివారం 6 జూన్ 2026

# నీటి నిల్వ చెరువును (ఇంకుడుగుంత ) ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.





**కామారెడ్డిజ్జూన్5( . :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా *IDOC* ప్రాంగణంలో *DMFC(T)* నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

*DMFC(T)* నిధుల నుంచి రూ. 6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడు తుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనం తరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి అదనపు కలెక్టర్ చీఎ గిరి, ఐ=ఐూ దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ▪ జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ జూన్ 5,( . :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని పెంచికల్‌పేట్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలామణి, జిల్లా అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి అప్పయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయమైన పర్యావరణహిత వస్తు వులను ఉ పయోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలిగితే భావితరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ఎలినో ప్రభావం వలన ఉష్ణోగ్రత పెరగడం, నీటి లభ్యత తగ్గడం మానవాళి మనుగడకు ప్రమాదం అని తెలిపారు. చెట్లు నాటడమే కాకుండా నీటిని పొదుపుగా

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

- అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి
- ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి




**హైదరాబాద్, జూన్ 03:**

సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.



### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి పాల్గొన్నారు.

# మైనారిటీలపై వేధింపుల ఆరోపణలు అవాస్తవం: ఎన్వీ సుభాష్



**హైదరాబాద్, జూన్ 5(** దేశంలో మైనారిటీలపై వేధింపులు జరుగుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అవి రాజకీయ ప్రేరేపిత ప్రచారమేనని తెలంగాణ బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి. సుభాష్ అన్నారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ఖఌతీవఅ =ఌ–యిఌయిబ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మత, కుల, ప్రాంత భేదాలు లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. మైనారిటీలలో భయాందోళనలు సృష్టించి రాజకీయ లాభాలు పొందేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధ హక్కులు, చట్టపరమైన రక్షణ ఉన్నాయని పేర్కొన్నారు.

### డీలిమిటేషన్ బిల్లుపై కేంద్ర సంప్రదింపుల విధానానికి బీజేపీ స్వాగతం

ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై వివిధ రాజకీయ పార్టీలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని తెలంగాణ బీజేపీ స్వాగతి ంచింది. ఎన్.వి. సుభాష్ మాట్లాడుతూ డీలిమిటేషన్ అనేది దేశ ప్రజాస్వామ్య ప్రతినిది త్వానికి సంబంధించిన కీలక రాజ్యాంగ ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ సమగ్ర దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉ ంచుకుని చర్చల్లో నిర్మాణాత్మకంగా పాల్గొని విస్తృత ఏకాభిప్రాయానికి సహకరించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థల బలోపేతం, సమాన ప్రతినిధిత్వం, సహకార సమాఖ్య వ్యవస్థ పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు.

# రెపో రేటు యథాతథం.. జీడీపీ వృద్ధి అంచనా తగ్గించిన ఆర్బీఐ

**ముంబై, జూన్ 5:( .** భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఎంపీసీ సభ్యులు ఏక్( వంగా ఆమోదించారు. విధాన వైఖరిని ***(Policy Stance)*** "న్యూట్రల్"గానే కొనసాగిస్తూ, భవిష్యత్ ఆర్థిక పరిస్థి తులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని ఆర్బీఐ స్పష్టం చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. అదే సమయంలో ద్రవ్యోల్బణ (ఇన్‌ఫ్లేషన్) అంచనాను 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రూపాయి బలహీనత, రుతుపవనాలపై అనిశ్చితి వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా మారవచ్చని ఆర్బీఐ పేర్కొంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలను బలోపేతం చేయడంతో పాటు డాలర్ ప్రవాహాలను పెంచేందుకు పలు చర్యలను ప్రకటించింది. కాగా, రెపో రేటులో ఎలాంటి మార్పు లేకపోవడంతో గృహ రుణ గ్రహీతలకు తక్షణ ఈఎంఐల తగ్గింపు లభించదని స్పష్టమైంది.




ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణ కాంత్ పార్కులో మొక్కను నాటిన హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు.. శాసనసభ్యులు శ్రీ నవీన్ యాదవ్, జిహెచ్ఎంసి కమిషనర్ శ్రీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా గారు ఇతర ఉన్నతాధికారులు, తదితరులు..

# అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై కవిత ఆగ్రహం

**హైదరాబాద్, జూన్ 5( ).** అమీర్‌పేట్ మైత్రివనం ఎదురుగా అగ్ని ప్రమాదం జరిగిన షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, అగ్నిప్ర మాదం ఆకస్మికంగా జరిగినది కాదని, ప్రమాద సూచనలు ఉన్నాయని మూడు నెలలు గా వ్యాపారులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. వెను కవైపు ఉన్న మెస్‌లో గతంలో షార్ట్‌సర్క్యూట్ ఘటనలు జరిగినట్లు బాధితులు తనకు వివరించారని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ఘటన జరిగిన తర్వాత గంటకు పైగా ఫైరింజన్లు ఆలస్యంగా చేరుకోవడం విచారకరమని అన్నారు. సమయానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే నష్టం గణనీయంగా తగ్గేదని పేర్కొన్నారు. ప్రమాదంలో నష్టపోయిన షాపులన్నింటికీ అవసరమైన అనుమతులు ఉన్నాయని, బాధితులకు ప్రభుత్వం తక్షణ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయమని కవిత పేర్కొన్నారు.

# అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ జూన్ 5,(**

జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ పెట్టుబడులకు కేంద్రం భారీ ప్రోత్సాహం

**న్యూఢిల్లీ, జూన్ 5( . :** భారత మూలధన మార్కెట్లను మరింత లోతుగా అభివృద్ధి చేయడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలను ప్రకటించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మరియు విదేశాల్లో నివసించే వ్యక్తులు భారతీయ ఈక్విటీలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు నిబంధనలను సడలించింది. ఈ సంస్కరణల ప్రకారం, విదేశాల్లో నివసించే వ్యక్తులు (పీఆర్‌ఓఐలు) ఇకపై పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ ద్వారా భారతీయ లిస్టెడ్ కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టవచ్చు. ఒక్కో కంపెనీలో పెట్టుబడి పరిమితిని 5 శాతం నుంచి 10 శాతానికి, మొత్తం పీఆర్‌ఓఐల పెట్టుబడి పరిమితిని 10 శాతం నుంచి 24 శాతానికి పెంచారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులపై ఉన్న పలు పరిమితులను తొలగిస్తూ, 15, 30, 40 ఏళ్ల కాలపరిమితి గల కొత్త ప్రభుత్వ బాండ్లు, సావరిన్ గ్రీన్ బాండ్లను పూర్తిస్థాయి ప్రాప్యత మార్గం (ఎఫ్ఏఆర్) పరిధిలోకి తీసుకొచ్చారు. అలాగే ప్రభుత్వ సెక్యూరిటీల ద్వారా ఎఫ్‌పీఐలు పొందే వడ్డీ, మూలధన లాభాలపై ఆదాయ పన్ను మినహాయింపు కల్పించారు. ఈ మినహాయింపు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ చర్యలతో భారత మార్కెట్లలో దీర్ఘకాలిక విదేశీ పెట్టుబడులు పెరగడంతో పాటు విదేశీ మారక నిల్వలు బలోపేతం అవుతాయని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. పెన్షన్ నిధులు, బీమా సంస్థలు, సావరిన్ వెల్త్ ఫండ్లు వంటి అంతర్జాతీయ పెట్టుబడిదారుల భాగస్వామ్యం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

## నాణ్యమైన విద్యా కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు

■ కె. రవీందర్ గౌడ్ ఉపాధ్యాయులు దుద్యాల




**దుద్యాల మండలం, జూన్,05() :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాటలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుద్యాల ఉపాధ్యా యులు సమీప గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం అలీ ఖాన్ పల్లి గ్రామములో నిర్వహిస్తూ దుద్యాల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో తరగతిలో మండల స్థాయి మార్కులు సాధించడం జరిగిందని కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య పైన చూపుతున్నటువంటి ప్రత్యేకత పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి ఇవి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించబడుతుందని కావున ప్రతి తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించి వారికి నాణ్యమైన విద్య అందే విధంగా తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో కె రవీందర్ గౌడ్ ' రాము' రమేష్ 'అశోక్ తదితరఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి జనగణన పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, జూన్ 5:( :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సింగ్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జనగణన ప్రక్రియను డీఎంసీఎస్, డీఎస్‌వో, ఆర్డీవో, తహసీల్దార్, జనగణన అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లు అత్యంత వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోళ్లు పూర్తైన కేంద్రాల నుంచి సిబ్బంది, వాహనాలు, సామగ్రి, హమాలీలను ధాన్యం నిల్వలు ఉన్న కేంద్రాలకు తరలించి వినియోగించాలని ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేసి, ఆన్‌లైన్ యాప్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మ అవార్డులు--2027కు నామినేషన్ల ఆహ్వానం..

### జూలై 31 వరకు దరఖాస్తులకు అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 5:(**

దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు--2027 కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నామినేషన్లను ఆహ్వానించింది. 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించనున్న ఈ అవార్డుల కోసం నామినేషన్లు మార్చి 15, 2026 నుంచి స్వీకరిస్తుండగా, దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీగా నిర్ణయించారు. నామినేషన్లు కేవలం జాతీయ పురస్కారాల పోర్టల్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో స్వీకరించబడతాయి. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, విజ్ఞానం, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, పరిశ్రమలు తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు ఈ అవార్డులకు అర్హులు. పద్మ అవార్డులను "ప్రజల పద్మ"గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి పౌరుడు అర్హులైన వ్యక్తులను సిఫారసు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, దివ్యాంగులు, సమాజ సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతిభావంతుల పేర్లను ఎక్కువగా ప్రతిపాదించాలని సూచించింది. నామినేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ మరియు పద్మ అవార్డుల పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి.

# రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి

■ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జూన్5( . :** అకాల వర్షాల కార ణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయా లని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్‌పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఎఛీ రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు. తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

# చేనేత కళాకారులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి

- "థ్రెడ్స్ పోచంపల్లి" చేనేత ప్రదర్శనను ప్రారంభించిన
- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ జూన్ 5( :** యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జూన్ 5-7 నుండి మూడు రోజుల "థ్రెడ్స్ పోచంపల్లి" చేనేత ప్రదర్శనను వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

పోచంపల్లి మరియు పరిసర ప్రాంతాల చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు మరింత ప్రచారం కల్పించి, చేనేత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో సంప్రదాయ వృత్తులను కాపాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చేనేత రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత రెండున్నర సంవత్సరాలలో చేనేత సంఘాలు, కళాకారుల సంక్షేమం కోసం సుమారు రూ. 1,000 కోట్ల మేర వివిధ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. భారతదేశంలోనే తొలిసారిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ (××ు) ను రాష్ట్రంలో ఏర్పాటు చేసి చేనేత కుటుంబాల యువతకు ఆధునిక విద్య, నైపుణ్యాలను అందిస్తున్నట్లు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో లక్షలాది మంది చేనేత కుటుంబాలకు చెందిన వారు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోనే 12 వేల మందికి పైగా చేనేత కార్మికులు మరియు అనుబంధ కార్మికులు ఈ రంగంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించి ఆదాయాన్ని పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందన్నారు. పోచంపల్లి ఇక్కత్ చీరలు, పుట్టపాక టై అండ్ డై రుమాళ్లు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాయని పేర్కొన్నారు. పోచంపల్లి సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందడంలో చేనేత కార్మికుల ప్రతిభ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చొరవతో "థ్రెడ్స్ పోచంపల్లి" ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచంపల్లి ఇక్కత్ చీరల డూప్లికేషన్ సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు తెలిపారు. అసలైన పోచంపల్లి ఉత్పత్తులను గుర్తించే విధంగా సాంకేతిక ఆధారిత ట్యాగింగ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాల్లోని తెలుగు సంఘాలు, ప్రవాస భారతీయుల వేదికల ద్వారా పోచంపల్లి ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పోచంపల్లి చేనేత ఉత్పత్తులను హైదరాబాద్ వినియోగదారులకు నేరుగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో పోచంపల్లి, సిరిపురం, పుట్టపాక, ఒరిగొండ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 100 స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇలాంటి ప్రదర్శనలను ప్రతి సంవత్సరం నిర్వహించి చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని చేనేత కళాకారులకు విస్తృత మార్కెటింగ్ వేదిక కల్పించాలనే ఉద్దేశంతో "థ్రెడ్స్ పోచంపల్లి" ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగరవాసులు, సందర్శకులు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. పోచంపల్లి ఇక్కత్‌కు భౌగోళిక గుర్తింపు (+×) లభించడం ద్వారా ఈ ప్రాంత చేనేత కళకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ కళను పరిరక్షించడంతో పాటు ఆధునిక మార్కెటింగ్ అవకాశాలను కల్పించాల్సిన అవసరాన్ని పలువురు వక్తలు ప్రస్తావించారు.

మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో పోచంపల్లి ఇక్కత్ చీరలు, దుస్తులు, గృహాలంకరణ వస్తువులు, పుట్టపాక టై అండ్ డై రుమాళ్లు, హస్తకళ ఉత్పత్తులు సహా వివిధ చేనేత వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. వినియోగదారులు నేరుగా చేనేత కళాకారుల వద్ద నుండి ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దుద్దం వెంకటరమణ, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్లు, చేనేత సంఘాల ప్రతినిధులు, కళాకారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రెయినేజీ కాలువకు విముక్తి



**రాయపోల్,జూన్ 5:** రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలోని గజ్వేల్ బైపాస్ రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని అధికారులు తొలగించి కాలువను శుభ్రపరిచారు. కాలువ పూర్తిగా కలుపు మొక్కలతో కప్పుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందంటూ గురువారం సమయం న్యూస్ లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహానికి అనుకూలంగా మార్గాన్ని శుభ్రం చేశారు. దీంతో వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండే ప్రమాదం తొలగడంతో పాటు దోమల వ్యాప్తి, అంటువ్యాధుల భయాలు కూడా తగ్గనున్నాయని గ్రామస్థులు తెలిపారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సమయం న్యూస్ కు, వెంటనే స్పందించి శుభ్రపరిచిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం దృష్టి సారించాలని ప్రజలు కోరారు.

# కోస్గి పోలీస్ స్టేషన్ నూతన SHOగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పురుషోత్తం.




**కోస్గి మున్సిపల్, (మం)జూన్,05 :** నారాయణపేట జిల్లా కోస్గి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఎస్సై పురుషోత్తం శుక్రవారం రోజు అధికారికంగా బాధ్య తలు స్వీకరించారు. ఇతను ఇంతకుముందు జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై కోస్గి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కాగా, ఇంతకు ముందు కోస్గి ఎస్సైగా పనిచేసిన ఎస్సై బాలరాజు జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కోస్గి నూతనఎస్సై పురుషోత్తం మాట్లాడుతూ... కోస్గి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాల అమలు, గ్రామాల్లో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందించే దిశగా కృషి చేస్తామని ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్
- జాతీయ లోక్ అదాలత్ ద్వారానే సత్వర న్యాయం
- కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు... రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు.
- రాజీ మార్గమే రాజమార్గం




**నారాయణపేట, జూన్,05( :** వివాదాలను పెంచుకుంటూ పోతే అవి జీవితకాలం కొనసాగుతాయని, పరస్పర అవగాహనతో రాజీకి వస్తే వెంటనే పరిష్కార మవు తాయని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ 20వ తేదీ వరకు నారాయణపేట, కోస్గి, మక్తల్ కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ పడదగిన కేసులను సామ- రస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పోషణ కేసులు, వైవాహిక వివాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, చిన్నపాటి దొంగతనాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ బకాయిలు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని, న్యాయస్థానం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పరిశ్రమల అభివృద్ధికి అధికారులు మార్గదర్శకులుగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం జూన్ 5( :** జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల పెంపే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఉపాధి కల్పన కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన సలహాలు, సహకారం అందించి కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను త్వరగా పరిష్కరించి, అర్హులైన వారికి సబ్సిడీలు, ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. టీజీఐపాస్ ద్వారా అందిన 50 దరఖాస్తుల్లో 39 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహక పథకాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక వనరుల ఆధారంగా క్లస్టర్ అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్రణాళికలు




రూపొందించాలని అన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఉద్యోగ మేళాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో డేవిడ్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎల్‌డీఎం రామిరెడ్డి, మెప్మా పీడీ రాజేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు మొదటి విడత అక్రిడిటేషన్‌కార్డులు అందచేత.

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా.

**హైదరాబాద్ జూన్5( . :** జిల్లాలోని వివిధ దినపత్రికలు, చానల్స్ లలో పనిచేస్తున్నటువంటి అర్హులైన జర్నలిస్టుల ందరికీ అర్హత మేరకు అక్రిడిటేషన్ కార్డులను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. శుక్రవారం మొదటి విడత కార్డులకు సంబంధించి తన ఛాంబర్ లోని కమి టీ సభ్యులు అలాగే దినపత్రికలు చానల్స్ ల ప్రతినిధు లకు అక్రిడేషన్ కార్డులను అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అలాగే దినపత్రికలు , చానల్స్ వారీగా డిపిఆర్ఓ కార్యాలయం నుండి మొదటి విడత మంజూ రైన కార్డులను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్డులు పొందిన ప్రతి ఒక్కరికి కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఇంచార్జ్ సహాయ సంచాలకులు మహమ్మద్ హబీబ్, డి ఈ వెంకట్, కమిటీ సభ్యులు శంకర్ శిగ, నవీన్ కుమార్ యారా, మహమ్మద్ రఫియుద్దీన్ గౌరీ, కొమ్ము రాజు, మన్సూర్ అలీ , మోహనాచారి, దయానంద్, ప్రణీత... వివిధ పత్రికల చానల్స్ ప్రతినిధులు సునీల్ కుమార్, మహమ్మద్ హమీద్ ఖాన్, గోపీనాథ్, రాజశేఖర్, మహేష్, మల్లేష్ బాబు, బాలకృష్ణ, ఉపేందర్, దయాకర్ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఏఎస్ కంప్యూటర్ లో వేసవి కాలంలో కంప్యూటర్ శిక్షణద పొందిన 120 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించడం జరిగింది

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.నరసింహ రెడ్డి,
- ఉర్దూ మీడియం ప్రిన్సిపాల్ వికార్ హైమద్,





**కొడంగల్ మున్సిపల్,జూన్,05(**

వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టంలోని ఏ ఎస్ కంప్యూటర్ లో వేసవి కాలంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు 120 మంది విద్యార్థులకు శుక్రవారం పరీక్ష నిర్వహించడం జరిగింది. కావున సమ్మర్ కంప్యూటర్ ప్రజ్ఞ ఈ రోజుల్లో ఎంతో అవసరం అని ప్రతి విద్యార్థికి తెలియజేశారు. నిత్యజీవితంలో ఒక భాగం అవుతున్న ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రతి ఒక్కరికి అవగాహన తీసుకురావాలని దేశం లో ప్రతి విద్యార్థి ఈరోజు టెక్నాలజీని ఎంతో అద్భుతంగా వినియోగించుకోవాల్సిందిగా విద్యార్థులకు చెప్పడమే కాకుండా వారికి ఈరోజు పరీక్షలు నిర్వహించడం జరిగినది 45 రోజులుగా శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తూ జులై 5 న ఫలితాలు మరియు ధూపత్రాలు అందజేస్తారని తెలియజేశారు. ముఖ్యఅతిథిగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు మరియు వారితో పాటు ఉర్దూ మీడియం ప్రిన్సిపాల్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు అలాగే సెంటర్ డైరెక్టర్ పద్మనాభ రెడ్డి మరియు అన్నపూర్ణ మరియు ల్యాబ్ ఇన్చార్జ్ స్వాతి పాల్గొన్నారు ప్రిన్సిపల్ ప్రత్యేకించి ఈ మధ్యకాలంలో ఏ ఐ అనేక రకరకాల శబ్దాలు వినబడుతున్న ఈ ఆధునిక ప్రపంచంలోకి ప్రతి వారికి కంప్యూటర్ అవేర్నెస్ విద్యార్థులే కాదు నేడు జరుగుతున్న ఉపాధ్యాయులు కూడా ఎంతో ప్రాధాన్యతగా ఈ యొక్క కలెక్ట్ టెక్నాలజీని వాడడానికి మబ్బు చూపిస్తున్నారని చెప్పవచ్చు కాకపోయినా ఈ ఆధునిక యుగం లో టెక్నాలజీ ఇంకా బలపడుతుందని కావున ప్రతి ఉద్యోగి ప్రతి గృహిణి ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని చెప్పడమే కాకుండా ముఖ్యంగా విద్యార్థులకు చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్ ఎంతో అవసరం అని చెప్పడం జరిగింది. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్ నరసింహ రెడ్డి ఉర్దూ మీడియం ప్రిన్సిపల్ వికార్ హైమద్‌అధ్యాపకులు పందరి మధుసూదన్ రెడ్డి శేఖర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు

# రీజినల్ కోఆర్డినేటర్, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు,



**వికారాబాద్, జూన్,05(**

వికారాబాద్, జిల్లాటెండరు ప్రకటనఆర్.సి.నెంబర్, =C/158/Tender/VKRBD/2026తేదీగీ 05.06.2026 2026-27 విద్యా సంవత్సరానికి, వికారాబాద్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు క్రింది సేవల కోసం ఆసక్తి గల టెండర్ దారుల నుంచి టెండర్లు స్వీకరించబడతాయి. 1. కూరగాయలు మరియు పండ్లు 2. స్కిన్స్ చికెన్ మరియు మటన్, 3. కేటరింగ్ సేవలు, 4. స్వీపింగ్ ఢ సానిటేషన్. టెండర్ ఫారమ్ ధరగీరూ. 2,000/- (ఒకటి), సాధారణ జువీణగీరూ. 30,000/- రాజ/ూలకు జువీణ (40% రాయితీ)గీరూ. 18,000/- సంబధిత విద్యాలయం నందు డి డి రూపంలో చెల్లించి తేది గీ 05.06.2026. నుండి 15.06.2026. వరకు పొందగలరు. పూర్తిచేచినా ధారఖాస్తులు సమర్పించుటకు చివరి తేది 15.06.2026. సాయంత్రం 4.00 గం. వరకు టెండర్లు తెరుసుటకు తేదిగీ 17.06.2026. . ఉదయంగీ 10.00. గం.లకు టెండర్లు తెరుసు స్థలంగీ అదనపు కలెక్టర్లు, వికారాబాద్ జిల్లా వారి కార్యాలయం నందు జరుగును. ఇట్టి టెండర్లు ఎలాంటి ముందస్తూ నోటీసు లేకుండా వాయిదా వేయుట మరియు రద్దు చేయుటకు అదనపు కలెక్టరు, వికారాబాద్ జిల్లా వారికి పూర్తి అధికారం కలదు.

గిరిజన గురుకులవిద్యాలయములు

1).*TGTW RJC (B), Kulkacherla:* 7799579659, 2). *TGTW _RS (B), Kulkacherla* 9490413141, 3). *TGTWURJC (B), Kodangal* 8333925370, 4). *TGTW SOE /COE (G), Pargi* గీ9398637673, 5). *TGTURJC (G), Tandur* గీ7989300047. Sd/ రీజినల్ కోఆర్డినేటర్, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టరు వికారాబాద్ జిల్లా

# రాయకోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

- సమయపాలనను కచ్చితంగా పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ సెలవుపై వెళ్లరాదని ఆదేశించారు



సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో శుక్రవారం రోజు జిల్లా వైద్య ఢ ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలిత దేవి సింగీతం కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం రాయకోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, హాజరు రిజిస్టర్లు, వైద్య రికార్డులు, లేబర్ రూమ్, ప్రయోగశాల (ల్యాబ్) నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమావేశమై ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్నేహపూర్వకంగా మరియు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని తెలిపారు. సమయపాలనను కచ్చితంగా పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ సెలవుపై వెళ్లరాదని ఆదేశించారు. అలాగే, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, ప్రజలకు మెరుగైన మరియు సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు

# నిందితులకు శిక్ష పడేలా కేసుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 5:(** నిందితులకు శిక్ష పడేలా చేయడంలో కోర్టు డ్యూటీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కోర్టు డ్యూటీ అధికారులకు కేసులపై పూర్తి అవగాహన కల్పించాలని, బాధితులకు న్యాయం జరిగేలా కేసులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు. సమన్లు, వారెంట్లు సకాలంలో అందజేయడంతో పాటు, విచారణ సమయంలో సాక్షులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న ఆస్తులను కోర్టులో సమర్పించడం, న్యాయాధికారులతో సమన్వయం పాటించడం ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కోర్టు లైజనింగ్ అధికారి, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణ కాంత్ పార్కులో మొక్కను నాటిన హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు.. శాసనసభ్యులు శ్రీ నవీన్ యాదవ్, జిహెచ్ఎంసి కమిషనర్ శ్రీ కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా గారు ఇతర ఉన్నతాధికారులు, తదితరులు..

## హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం విజయవంతం



**కొడంగల్ మండలం, జూన్,05 :** "బడిబాట" కార్యక్రమంలో భాగంగా కొడంగల్ మండలం హుస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజిలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతి కుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య మరియు సిబ్బంది మొత్తం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి వెలుపల ఉన్న చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి, పిల్లలను వెంటనే పాఠశాలలో చేర్పించేలా ప్రోత్సహించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం, బూట్లు-సాక్సులు, డిజిటల్ తరగతి గదులు, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి అన్ని సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పలువురు పిల్లలు పాఠశాలలో ప్రవేశాలు పొందారు. 100% ఎన్‌రోల్‌మెంట్ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో మొక్కలు నాటే కార్యక్రమం

- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని
- అటవీ శాఖ మరియు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో
- జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో మొక్కలు నాటే కార్యక్రమం
- ప్రిన్సిపల్ డీస్ట్రిక్ట్ ఉ సెషన్ జడ్జ్ ఎం.నాగరాజు,జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్





**వికారాబాద్, జూన్,05( :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహిం చిన మొక్కలు నాటే కార్యక్రమంలో, జిల్లా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ఉ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజు గారితో కలిసి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొని మొక్కలు మొక్కలు నాటడం జరిగింది.. ఈ సందర్భంగా జిల్లా గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ఉ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి మరియు రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడుకుంటూ వృక్షాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా పెంచాలని ఆమె కోరారు. పోలీస్ శాఖ తరఫున పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా హరితహారాన్ని, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఇతర న్యాయమూర్తులు, అటవీ శాఖ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 జిల్లా ఎన్నికల అధికారి& కలెక్టర్,-వికారాబాద్

**వికారాబాద్, జూన్,05(**

తెలంగాణలో భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు ముఖ్యమైన నోట్స్ కింద ఇవ్వబడ్డాయి:

1. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో శుద్ధి చేయడానికి భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా దశలవారీగా చేపట్టిన ఒక ప్రత్యేక ప్రక్రియ. దీని ముఖ్య ఉద్దేశం ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, ఒకే ఓటరుకు రెండు చోట్ల ఓటు *(Duplicate)* లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం. తెలంగాణలో దాదాపు 23 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2002 నాటి చివరి ాూ×= తో పోల్చుకుంటూ ప్రస్తుత ఓటర్ల వివరాలను అనుసంధానించే *(Mapping)* ప్రక్రియను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి *(CEO)* పర్యవేక్షిస్తున్నారు.

2. తెలంగాణలో *SIR* 2026 ముఖ్యాంశాలు ఉ ఓటర్ల బాధ్యతలు

తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి గారు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్లు మరియు బూత్ లెవెల్ అధికారులు (దీూా) పాటించాల్సిన ముఖ్యమైన నియమాలు ఇవే:

2002 డేటాతో మ్యాపింగ్ *(Mapping with SI=* 2002): ప్రస్తుత ఓటర్ల జాబితాలోని ఓటరు పేరు లేదా వారి బంధువుల (తల్లిదండ్రులు/నాయనమ్మ/తాతయ్య) పేర్లను 2002 లో జరిగిన చివరి *SIR* డేటాతో అనుసంధానం చేస్తున్నారు.

ఎలాంటి పత్రాలు అవసరం లేదు *(No Documents in Enumeration Phase)*: ఈ ఎన్యుమరేషన్ (గణన) ప్రక్రియలో మీ వివరాలు 2002 డేటాతో సరిపోలితే ఎలాంటి అదనపు డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు.

నోటీసులు జారీ చేయడం: ఒకవేళ ఓటరు వివరాలు 2002 ాూ×= డేటాతో మ్యాచ్ కాకపోతే, వారు ఆ ప్రాంతంలో నివసించడానికి అర్హులేనని నిరూపించుకోవడానికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేస్తుంది. అప్పుడు మాత్రమే సపోర్టింగ్ డాక్యుమెంట్లు అందించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ వెరిఫికేషన్: ఓటర్లు తమ లేదా తమ పూర్వీకుల 2002 నాటి వివరాలను తెలంగాణ జజూా అధికారిక వెబ్‌సైట్ *(ceotelangana.nic.in)* లేదా కేంద్ర ఓటర్ల పోర్టల్ *(voters.eci.gov.in)* ద్వారా సరిచూసుకోవచ్చు.

3. *SI=* 2026 ముఖ్యమైన కాలక్రమం *(Schedule)*

ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ క్రింది విధంగా సాగుతుంది:

క్రమ సంఖ్య కార్యక్రమం కాల వ్యవధి

1 ఇంటింటి సర్వే *(House to House Enumaration)* 25.06.2026 *to* 24.07.2026

2 ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా ప్రచురణ 31.07.2026

3 క్లైములు ఉ అభ్యంతరాల ధాఖలు కాలం



31.07.2026*to* 30.08.2026

4 నోటీసు దశ (జారీఓ, విచారణ ఉ ధృవీకరణ) ఎన్యూమరేషన్ ఫారంలపై నిర్ణయం మరియు క్లైములు, అభ్యంతరాల పరిష్కారాన్ని *ERO* లు (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు) ఏకకాలంలో నిర్వహిస్తారు.

31.07.2026*to* 28.09.2026

5 తుది ఓటర్ల జాబితా ప్రచురణ *(Final Publication)* 01.10.2026

4) ఎన్యూమరేషన్ ఫారమ్ (గణన పత్రం) పంపిణీకి విధి విధానాలు.

(ఖ) బూత్ స్థాయి అధికారుల (దీూాం) ద్వారా పంపిణీ: బూత్ స్థాయి అధికారులు (దీూాం) ప్రతి ఇంటిని సందర్శిస్తారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లకు ముందే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారమ్లను రెండు ప్రతులలో (ఎబజూశ్రీఅ-ఝ్వ) పంపిణీ చేస్తారు. అలాగే ఆ ఫారమ్ను ఎలా నింపాలో మార్గదర్శకత్వం చేస్తారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్లలో సంబంధిత వివరాలను పూరించాల్సి ఉంటుంది. పూరించిన ఈ ఫారమ్ను బూత్ స్థాయి అధికారులు తమ తదుపరి సందర్శనలో సేకరిస్తారు. బూత్ స్థాయి అధికారి ఆ ఫారమ్లను సేకరించి, ఎన్యూమరేషన్ ఫారమ్ యొక్క ఒక ప్రతిని తన వద్ద ఉంచుకుంటారు. రెండవ ప్రతిపై ఫారమ్ అందినట్లు రశీదు (అక్నాలెడ్జ్మెంట్) ఇస్తారు. ఈ రెండో ప్రతిని ఓటరు తన వద్దే భద్రపరుచుకోవాలి.

(ఎ) ఆన్లైన్ ద్వారా సమర్పణ: ఓటరు ఎన్యూమరేషన్ ఫారమ్ను ఆన్లైన్లో కూడా పూరించి సమర్పించవచ్చు. దీని కోసం భారత ఎన్నికల సంఘం *(ECI)* అధికారిక వెబ్సైట్ *https://voters.eci.gov.in* లో సదుపాయం కల్పించబడింది.

ఓటర్లు *SI=* 2002 లో తమ వివరాలను వెతకడానికి వీలుగా ఆన్లైన్ శోధన సదుపాయం కూడా అందుబాటులో ఉంది.

(ఃి) కొత్త ఓటర్ల నమోదు: బూత్ స్థాయి అధికారులు కొత్త ఓటర్ల నమోదు కోసం అవసరమైతే డిక్లరేషన్ ఫారమ్తో పాటు ఫారమ్-6 ను కూడా అందిస్తారు.

(ు) దీూా సందర్శనలు: బూత్ స్థాయి అధికారి ప్రతి ఓటరు ఇంటిని కనీసం 3 సార్లు సందర్శిస్తారు.

7) *SI=*, 2002 ఓటర్ల జాబితాలో ఓటరు పేరు ఇప్పటికే ఉందో లేదో తనిఖీ చేసుకొనే విధానం.

ఓటర్లు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి అధికారిక వెబ్ సైట్ *https://ceotelangana.nic.in* ` *https://voters.eci.gov.in* లోని *Search by Electors Details* ఆప్షన్ ద్వారా తమ పేరును తనిఖీ చేసుకోవచ్చు.

పార్ట్ వారీగా ఓటర్ల జాబితా డేటాాణఖీ రూపంలో కూడా సైట్లో ఉంచబడింది. తమ పోలింగ్ స్టేషన్ తెలిసిన ఓటర్లు ఆ *PDF* లో కూడా తమ పేర్లను వెతకవచ్చు.

*SI=*, 2002 ఓటర్ల జాబితా యొక్క ముద్రిత హార్డ్ కాపీ బూత్ స్థాయి అధికారి (దీూా) వద్ద అందుబాటులో ఉంటుంది. మీ పేరును కనుగొనడంలో వారు మీకు సహాయం చేస్తారు.

5. సహాయక పత్రాలు 2002 డేటాతో వివరాలు మ్యాచ్ కాని పక్షంలో, అర్హత నిరూపణ కోసం కింద పేర్కొన్న పత్రాలలో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుంది:

1. ఏదైనా కేంద్ర ప్రభుత్వం/రాష్ట్ర ప్రభుత్వం/ూఖ సాధారణ ఉద్యోగి/పెన్షనర్‌కు జారీ చేయబడిన ఏదైనా గుర్తింపు కార్డు/పెన్షన్ చెల్లింపు ఉత్తర్వు.
2. 1987 జూలై 1కి ముందు భారతదేశంలో ప్రభుత్వం/స్థానిక అధికారులు/బ్యాంకులు/పోస్ట్ ఆఫీస్/ా×జ/ూఖలు జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు/సర్టిఫికేట్/పత్రం.
3. సమర్థ అధికారం జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.
4. పాస్‌పోర్ట్
5. గుర్తింపు పొందిన బోర్డులు/విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/విద్యా ధృవీకరణ పత్రం
6. సమర్థ రాష్ట్ర అధికారం జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం
7. అటవీ హక్కుల ధృవీకరణ పత్రం
8. ాదీజ/ాజ/ూ లేదా కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఏదైనా కుల ధృవీకరణ పత్రం
9. జాతీయ పౌరుల రిజిస్టర్ (అది ఎక్కడ ఉన్నా)
10. రాష్ట్ర/స్థానిక అధికారులు తయారుచేసిన కుటుంబ రిజిస్టర్.
11. ప్రభుత్వం నుండి ఏదైనా భూమి/ఇల్లు కేటాయింపు ధృవీకరణ పత్రం
12. ఆధార్ కోసం, 09.09.2025 తేదీ 23/2025-జు=ా/ఎశీశ్రీ.×× లేఖ ద్వారా జారీ చేయబడిన కమిషన్ ఆదేశాలు వర్తిస్తాయి.

ముఖ్య గమనిక: ఓటర్లు ఎవరైనా తమ వివరాలను సరిచూసుకోవడానికి లేదా సందేహాల నివృత్తికై తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్ బూత్ లెవెల్ అధికారి (దీూా) లేదా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (జు=ా)ని సంప్రదించవచ్చు. 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 54-పరిగి, 55-వికారాబాద్, 56-తాండూర్ మరియు 72-కోడంగల్ లోని ప్రతి మండల/డివిజన్ మరియు జిల్లా స్థాయి కార్యాలయాల్లో ఇందుకోసం ప్రత్యేక హెల్ప్ డెస్కులు/క్యాంపులను కూడా ఏర్పాటు చేశారు.

జిల్లా ఎన్నికల అధికారి ఉ కలెక్టర్, వికారాబాద్ జిల్లా.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటి, న్యాయవాదులు,

- సిబ్బందితో హరిత ప్రతిజ్ఞ చేస్తున్న- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.
- పర్యావరణాన్ని కాపాడటం చట్టబద్ధమైన బాధ్యత.ప్లాస్టిక్ వద్దు, పచ్చదనం ముద్దు - జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.



**నారాయణపేట, జూన్,05**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన గౌరవ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు హరిత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ రోజుల్లో, అభివృద్ధి పేరుతో మనం ప్రకృతికి తీవ్రమైన హాని తలపెడుతున్నాం. విచక్షణారహితంగా అడవులను నరికివేయడం, ప్లాస్టిక్ వాడకం పెంచడం, మరియు కర్మాగారాల నుండి వచ్చే కాలుష్యం వల్ల భూమి వేడెక్కుతోంది. ఫలితంగా కరువులు, వరదలు, మరియు విచిత్రమైన వాతావరణ మార్పులను ఎదుర్కొంటున్నాం. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపారు. కోర్టు ఆవరణంలో పుల మొక్కలు మరియు పండ్ల మొక్కలను నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మరియు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్, ద్వితీయ శ్రేణి న్యాయాధికారి మురళీధర్,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కములుద్దీన్, ఫారెస్ట్ సిబ్బంది, మరియు మునిసిపల్ కమీషనర్ శంకర్, మున్సిపాలిటీ సిబ్బంది , చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పోలీస్ అధికారులు మరియు పారా లీగల్ వాలంటీర్లు కార్యక్రమం లో పాల్గొని మొక్కలు నాటారు.

# అనాథ బాలికలకు నేరుగా పాలిటెక్నిక్‌లలో ప్రవేశం

## మహిళా శిశు సంక్షేమ శాఖ, నారాయణపేట జిల్లా

**నారాయణపేట, జూన్,05(:**

అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికలకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండానే నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి (ణఅరీఊఅష్ ఔవశ్రీటుీవ ాటటఅఎవతీ) ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ సీపీ కండక్టర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ల్యాండ్ సర్వేయింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థినులకు ఫీజు, వసతి మరియు భోజన సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందించబడతాయని తెలిపారు. దరఖాస్తుదారులు తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం (అనాథలకు), హోమ్/హాస్టల్ బోనాఫైడ్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికేట్ మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో 08-06-2026 లోపు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, నారాయణపేటలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు o91 96031 59360 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా సంక్షేమ అధికారి శ్రీ ఎల్. రాజేందర్ గౌడ్ తెలిపారు.



# సైద్ధాంతిక నిబద్ధతకు నిలువుటద్దం చంద్ర రాజేశ్వరరావు

**సిద్ధాంతం కోసం ఆస్తిని త్యాగం చేసిన నిస్వార్థ కమ్యూనిస్టు యోధుడు**

**భారత కమ్యూనిస్టు పార్టీకి 28 ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం నేతృత్వం**

**తెలంగాణ సాయుధ పోరాటంలో, భూ ఆక్రమణ ఉద్యమాల్లో కీలక పాత్ర**

**ప్రతిష్ఠాత్మక 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పురస్కార గ్రహీత**

**నేడు చంద్ర రాజేశ్వరరావు జయంతి**

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ల తరబడి ఉద్యమాల్లో, అజ్ఞాతవాసంలో గడిపిన అలుపెరుగని కమ్యూనిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన ఆయన జయంతి నేడు (జూన్ 6). భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు జనరల్ సెక్రటరీగా నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకి నిలువుటద్దం.

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ 6వ తేదీన ఒక పెద్ద భూస్వాముల కుటుంబంలో రాజేశ్వరరావు జన్మించారు. అయితే, ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరిన తర్వాత తన సొంత కుటుంబ నేపథ్యానికి భిన్నంగా, ఆ భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా భూమి లేని నిరుపేదల తరఫున దశాబ్దాల పాటు పోరాటం సాగించారు. విద్యార్థి దశలోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులైన ఆయన, గాంధీజీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహంలో వాలంటీర్‌గా పాల్గొన్నారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను ఆరాధించేవారు. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లోనే హిందూ-ముస్లిం ఐక్యతకు కృషి చేస్తూ, మతవాద శక్తులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆ తర్వాత విశాఖలో మెడిసిన్ చేరినా, కమ్యూనిస్టు భావజాల వ్యాప్తి కోసం స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయడంతో ఆయన చదువు సవ్యంగా సాగలేదు.

తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా సావిత్రమ్మను కేవలం దండల మార్పుతో అతి నిరాడంబరంగా వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెద్దగా వ్యవహరించారు. సావిత్రమ్మ సైతం శాంతినికేతన్‌లో చదువుకోవాలనే తన కోరికను అణచుకుని, భర్తతో పాటు పూర్తికాలం కమ్యూనిస్టు ఉద్యమానికే జీవితాన్ని అంకితం చేశారు. కృష్ణా జిల్లాలో చల్లపల్లి జమీందారు అక్రమాలపై ఉద్యమించిన ఈ దంపతులు, ఆ తర్వాత తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులైన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి వంటి వారితో కలిసి పనిచేశారు. తెలంగాణలో పార్టీ నిర్మాణానికి, భువనగిరి ఆంధ్రమహాసభ నిర్వహణకు తోడ్పడుతూ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారు.

భారత విప్లవోద్యమ వ్యూహాలపై చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్.ఎ. డాంగే, మాకినేని బసవపున్నయ్యలతో కలిసి రాజేశ్వరరావు మాస్కో వెళ్లి అప్పటి సోవియట్ అధినేత స్టాలిన్‌తో చర్చలు జరిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి వంటి అగ్రనేతలతో కలిసి దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేశారు. 1970లలో దేశవ్యాప్తంగా సాగిన చారిత్రాత్మక భూ ఆక్రమణ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర అనన్యసామాన్యం. నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాల ప్రజోపయోగ నిర్ణయాలను సమర్థిస్తూనే, వారి నిరంకుశ చర్యలను, అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) పోకడలను నిక్కచ్చిగా వ్యతిరేకించారు.

రాజేశ్వరరావు తన పిత్రార్జిత ఆస్తిలో దక్కిన వాటాను పూర్తిగా పార్టీ నిధికి విరాళంగా ఇచ్చేశారు. ఆయన ఇచ్చిన లక్షలాది రూపాయల విరాళంతో ఆ రోజుల్లో వందలాది ఎకరాల భూమిని కొనవచ్చనేది పార్టీ వర్గాల మాట. అంతటి అగ్రనేత అయినా ఢిల్లీ లేదా ఎక్కడికి వెళ్లినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతుక్కోవడం ఆయన నిరాడంబరతకు నిదర్శనం.

చివరి రోజుల్లో సోవియట్ యూనియన్ కుప్పకూలడం, ఉభయ కమ్యూనిస్టు పార్టీల (సిపిఐ, సిపిఎం) పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యం కావడంపై ఆయన ఎంతో కలత చెందారు. ప్రపంచవ్యాప్త ప్రగతిశీల పోరాటాలకు మద్దతుగా నిలిచిన ఆయనకు 1994లో సోవియట్ యూనియన్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ఆర్డర్ ఆఫ్ లెనిన్' పురస్కారాన్ని అందజేసింది. దశాబ్దాల పాటు నిస్వార్థంగా ప్రజా క్షేత్రంలో పోరాడిన చంద్ర రాజేశ్వరరావు, తన 80వ ఏట 1994 ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో కన్నుమూశారు. వారి నిబద్ధత, నిరాడంబరత్వం నేటి తరానికి ఆదర్శం.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలి హైందవ సామ్రాజ్య నిర్మాత శివాజీ

## నేడు 'హిందూ సామ్రాజ్య దినం'!



పుణ్యభూమి అయిన భారతావనిలో అనేకానేక దేశ భక్తులు తమ జీవితమే ధర్మంగా, ధర్మ ప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యులైనారు. వారిలో నిత్య స్మరణీయుడు శివాజీ. శాలివాహన శకం 1596 ఆనంద నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్ పూర్వం మూడు ఘడియల ముహూర్తాన 1674 జూన్ 6న, చత్రపతి శివాజీ సింహాసనాన్ని అధిష్టించాడు. తద్వారా తొలి స్వరాజ్య సంస్థాపకుడైనాడు. అందుకే జ్యేష్ఠ శుక్ల త్రయోదశిని "హిందూ సామ్రాజ్య దినం"గా జరుపుకుంటారు. నేలకొరిగిన హిందూ ధ్వజాన్ని, మళ్లీ ఉత్తుంగ శిఖరాలలో ఎగురవేసి, మృతప్రాయమై ఉన్న హిందుత్వంలో అమృతాన్ని నింపి, ప్రాణప్రతిష్ట చేసిన మహనీయుడు శివాజీ. అతి సామాన్య బాల్యం, సాహసోపేత యవ్వనం, ప్రదర్శిత ధైర్యం, రాజనీతిజ్ఞత, చతురత, హిందువులలో మేల్కొల్పిన ఆ పూర్ణ దేశభక్తి అజరామరాలు. మహారాష్ట్ర ప్రాంతంలో, యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం, 1307 మార్చి 14 తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనము చేయబడగా, 350 ఏళ్ళ వరకు మరియొక ఒక హిందూ సామ్రాజ్యమే లేకుండెను. ఔరంగాబాద్ సమీపాన వేరూడ్ గ్రామానికి చెందిన మాలోజీ రావు అహ్మద్ నగర్ సుల్తాన్ నిజాం షాహీ కొలువులో ఉద్యోగియై, శక్తియుక్తులతో పూనా జాగీరును సంపాదించాడు. మొగలులతో యుద్ధం చేస్తూ 1605 లో మరణించాడు. అప్పటికి మాలోజి రావుకు 5ఏళ్ల శహాజి, 3 ఏళ్ల అరిఫ్ జీ కుమారులు ఉండిరి. మాలోజీ తమ్ముడగు విటోజీ వద్ద పెరగగా, నాటి నిజాం షాహీ కొలువులోని సర్దార్ లఖుజీ రావు కూతురు జిజియాబాయితో శహాజీ వివాహం జరిగింది. చిన్నతనంలోనే అత్త వారి ఇంటికి వచ్చిన జియాకు దేశ పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగింది. గోవధలు, దేవాలయాలు విగ్రహాల ధ్వంసాలు, ఆస్తుల దోపిడీలు, ఇళ్ల దహనాలు చూశాక ఆమెలో జుగుప్స రేగింది. బాల్యముననే రామాయణ, భారతాది గ్రంథాల పఠనం మూలంగా, విదేశీ పాలన నుండి విముక్తి కలిగి, రామరాజ్య స్థాపన కావాలనే కోరిక ప్రబలమైన నిలిచింది. జిజియాబాయి తండ్రి లఖుజీ రావు కు ముగ్గురు కుమారులు కాగా, వారి పలుకుబడులు నిజాం షాహికి కన్నెర్ర గావించగా, తన రాజధాని యగు దౌలతాబాద్ కు, ఆయన కుమారులను పథకం ప్రకారం పిలిపించి, నలుగురిని 1629 జూలై 25 ఆషాఢ పౌర్ణమి నాడు హత్య గావించాడు. శహాజీ మొగలుల వద్ద పనిచేస్తున్న సమయాన, 1630 ఫిబ్రవరి 19వ తేదీన, "భావి హైందవసామ్రాజ్య నిర్మాత" అయిన శివాజీ జన్మించాడు. శహాజీ తన జాగీరు పాలనా నిర్వహణకై, పండితుడు, పాలనాదక్షుడు "దాదాజీ కొండదేవ్" అనే బ్రాహ్మణుని నియమించుకోగా, జిజియాబాయి, కుమారునితో సహా ఆయన పర్యవేక్షణలో ఉండిరి. దాదాజీ కొండదేవ్, శివాజీకి వయసుకు తగ్గ విద్యలు, చక్కని శిక్షణనిచ్చి, పదవ ఏట వివాహం కూడా చేశాడు. వివాహానికి రాలేని తండ్రిని కలవడానికి బెంగళూరు వెళ్ళిన శివాజీకి, తండ్రి బీజాపూర్ ను చూపించగా, తురుష్కుల వల్ల ఉజ్వలమైన విజయనగర సామ్రాజ్యం విధ్వంసం, ఫలితంగా కొల్లగొట్ట బడిన ధనముతో వారు ఆనందంతో తులతూగే సంఘటనలు, హృదయంలో ప్రతిష్ఠితాలైనాయి. శివాజీ స్వాతంత్ర్య భావాలను గ్రహించిన శహాజీ, తన కుమారుని పూనాకు పంపుతూ, శాం రావు రాంఘెకర్ అనే అనుభవజ్ఞుని పీష్వా గా నియమించాడు. దేశభక్తి ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీకి, తల్లి శిక్షణ లోనే రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యము నిర్మాణం చేయాలని కోరిక స్థిరపడింది. శివాజీ జాగీరు లో రాంఝా గ్రామపు పటేలు, ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేల్ ను బంధించ, వధించి, కాళ్లు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడయ్యాడు. కాశ్మీరం నుండి కావేరి వరకు మధ్యనున్న చాందా గోండు వనం వదిలి, మిగిలిన దేశమంతా తురుష్కుల ఆధీనంలో ఉండెను. దేవగిరి, విజయనగరం రాజ్యాలు స్థాపించాక, రెండుసార్లు శహాజీ చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, శివాజీ మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం పాటుపడిన దేవాలయం, కొండ గుహ, కీకారణ్యం, ఇసుక తిన్నె లాంటి ప్రదేశాలలో చర్చోప చర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన "కాన" లోయలోని "తోరణ దుర్గాన్ని" జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. అందు లభించిన నిధితో, తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న "మురుంబ దేవ" గిరి పై, కొత్త కోటను నిర్మించి "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత "కువారి" కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కు పచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత "కొండనా కోట"ను తన స్వరాజ్యంలో కలుపుకున్నాడు. "శివరళ", "సుభాను మంగళి" దుర్గాలను వశపరచు కున్నాడు. ఇంతలో 1648 జూలై 25న శహాజీ, వజీరు ముస్తఫా, బాజీ ఘోర్పడెలు సైన్యంతో శహాజీ బంధించాడు. బీజాపూర్ సుల్తాన్ ను శరణు వేయడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే ప్రశ్నలకు తల్లి జిజియాబాయి, తన మాంగల్యం కన్నా దేశభక్తిని ప్రోత్సహించి సమాధానం లభింప జేసింది. పురంధర కోటలో ఉన్న శివాజీ, కొద్ది సైన్యానికి ఫతేఖాను సైన్యానికి భీకర యుద్ధం జరగగా, శివాజీకే విజయం చేకూరి, చివరకు 1648 ఆగస్టు 8న ఫతేఖాను ఓడింప బడ్డాడు. పురంధర దుర్గంలో ఫతేఖాను, బెంగళూరులో ఫరాదఖాన్ ఓటమి పాలు కాగా, బీజాపూర్ లో శహాజీ కూడా 1649 మే 16న జేష్ఠ లేక పౌర్ణమి నాడు బంధ విముక్తుడైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహారాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా, శివాజీ వారిని బంధించి ఉచిత పదవులు కట్టబెట్టి, నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానది సమీప టావలి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేక పోగా, ఆయన భార్య దత్త పుత్రునిగా యశ్వంత రావు కు పదవిని ఇచ్చాడు. ఆయన శివాజీ అధికారానికి ఇష్టపడని కారణాన, 1656 లో యుద్ధంలో ఓడించి స్వరాజ్యంలో కలుపు కున్నాడు. దీనిలో అంతర్భాగంగా కొండ ప్రాంతమైన "రాయగిరి" కోట నే కొన్నాళ్ళకు శివాజీ రాజధానిగా "రాయగడ దుర్గం"గా ఏర్పడింది. 1956 నవంబర్ 4న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్ షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదార్ ఐన, ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న రాజ్యంలో కలుపు కున్నాడు. బీజాపూర్ ప్రాంతంనుండి కోండ్వానా, కొంకణ, దండ రాజపురి, భీమండి, కళ్యాణి, మాహు తదితర కోటలను, పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని చేయించాడు. కటావ్, మయని, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాలిఘడ్,ఎగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కార తలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావ సింహ, జస్వంత్ సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్, సూరత్ నగరాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ జైత్రయాత్ర ఫలితంగా శాలివాహన శక 1596 ఆనంద నామ సంవత్సర జ్యేష్ట శుక్ల త్రయోదశి శనివారం సూర్యోదయాత్పూర్వ మూడు ఘడియల సుముహూర్తాన 1674 జూన్ 6 న సింహాసనాన్ని అధిష్టించాడు. రాజ్యాభిషేక అనంతరం రాజ్యారోహణం జరిగింది. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెండర్ మహారాజుకు ప్రణమిల్లి, 1600 రూపములను కానుకగా సమర్పించాడు. తన రాజ్యానికి అష్ట ప్రధానుల పారశీక నామాలను మార్చి, "సంస్కృత పేర్లు" పెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగం సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశము ను తయారు చేయించాడు. 30 సంవత్సరాలు శివాజీ ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ, హిందువులలో నూతనోత్తేజం నింపి, సార్వభౌమాధికార యుక్త స్వరాజ్యం స్థాపించ బడినది. 50 ఏళ్ల సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా, దేహం పూర్తిగా అలసి పోగా, ఆరోగ్యం క్షీణించి, 1680 ఏప్రిల్ 3న చైత్ర శుక్ల పాడ్యమి నాడు శివాజీ తుది శ్వాస వదిలాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అపర భగీరథుడు డాక్టర్ కేఎల్ రావు

**నీటిపారుదల రంగానికి ఎనలేని సేవలు అందించిన మహనీయుడు ▪ నేడు డాక్టర్ కానూరి లక్ష్మణరావు జయంతి**

నీటిపారుదల రంగంలో అపర భగీరథుడిగా కీర్తించబడే తెలుగు ప్రజలు గర్వించ దగిన డా. కానూరి లక్ష్మణరావు (జూన్ 6, 1902 – మే 18, 1986) భారత దేశం లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా నీటిపారుదల రంగంలో విప్లవాత్మకమైన పనులు చేసిన గొప్ప ఇంజనీరు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తర్వాత గొప్ప వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 1902 జూలై 14న కృష్ణా జిల్లా కంకిపాడు గ్రామంలో జన్మించిన కె.ఎల్.రావు మద్రాసు విశ్వ విద్యాలయములో ఇంజనీరింగు (బీ.ఈ) డిగ్రీ పూర్తి చేసి, గిండీ ఇంజనీరింగు కళాశాల నుండి పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఇంజనీరింగులో మాస్టరు డిగ్రీ (ఎం.ఎస్.సి ఇన్ ఇంజనీరింగ్) పొందిన తొలి వ్యక్తిగా నిలిచారు.



చదువు పూర్తయిన తర్వాత విశాఖ జిల్లా బోర్డు అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేశారు. తదనంతరం రంగూన్ కూడా ఉద్యోగం చేశారు. కొంత కాలం తర్వాత రావు గారు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో పరిశోధ కుడిగా చేరారు.

ఇంగ్లండ్ లోని బర్మింగ్ హామ్ విశ్వ విద్యాలయం నుండి 1939 లో డాక్టరేట్ డిగ్రీ పొందారు. కొంత కాలం పాటు ఇంగ్లాండ్ లో ప్రొఫెసర్ గా పనిచేసిన ఆయన 1946లో భారత దేశం తిరిగి వచ్చి మద్రాసు ప్రభుత్వంలో డిజైన్ ఇంజనీర్ గా చేరారు. 1950 – 54 మధ్యకాలంలో భారత ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్ గా పని చేశారు.

ప్రభుత్వంలో ఇంజనీర్ గా పని చేస్తున్న సమయాన, దేశం లోని అనేక నీటిపారుదల ప్రాజెక్టు లకు నమూనాలు తయారు చేశారు. నాగార్జునసాగర్, పులిచింతల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి ఎన్నో సుప్రసిద్ధ నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేశారు. గంగా, బ్రహ్మపుత్ర తదితర నదుల వరదల నివారణకై అనేక సూచనలు సలహాలు ఇచ్చారు. అందులో భాగంగానే గాంధీ సాగర్, జవహర్ సాగర్ రాణాప్రతాప్ సాగర్ వంటి నిర్మాణాలు సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వం నాగార్జున సాగర్, భాక్రానంగల్ ప్రాజెక్ట్, హిరాకుడ్ ప్రాజెక్ట్ విషయంలో పిలిపించిన విదేశీ ఇంజనీర్లు కూడా రావు ను సంప్రదించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇంజనీరింగ్ విషయాలకు సంబంధించి ఈయన రాసిన "ఇండియాస్ వాటర్ వెల్త్" అనే పుస్తకం నేటి తరాల శాస్త్రవేత్తలకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. ఉద్యోగ విరమణ అనంతరం నాటి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డి పిలుపు మేరకు 1962, 1967 ,1971 లో విజయవాడ నుంచి పార్లమెంటుకు పోటీ చేసి గెలిచారు. నెహ్రూ, శాస్త్రి, ఇందిరా గాంధీ, నేతృత్వంలోని ప్రభుత్వంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రిగా పని చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే గంగా బ్రహ్మపుత్ర నదిలో వర్షాకాలంలో చేరుతున్న నీటిని నిల్వ ఉంచి భారతదేశంలో క్షామ ప్రాంతాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు నీటి సౌకర్యం కల్పించే "నేషనల్ వాటర్ గ్రిడ్" పథకానికి రూపకల్పన చేశారు. 1963లో పద్మభూషణ్, రూర్కీ, ఆంధ్రా మరియు జే ఎన్ టీ విశ్వ విద్యాలయాల డాక్టరేట్లు పొందారు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్, అలాగే ఆల్ ఇండియా ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్ గా, రంగూన్ (బర్మా, ఇప్పుడు మయన్మార్)లో ప్రొఫెసర్‌గా, యునైటెడ్ కింగ్‌డమ్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఇంజనీరుగా చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా మూడు పర్యాయాలు రాష్ట్రపతి పురస్కా రం లభించింది. ఆయన జ్ఞాపకార్థం పులిచింతల ప్రాజెక్టుకు కె.ఎల్.రావు ప్రాజెక్టు అని నామ కరణము చేయ బడింది. ఒక ఇంజనీరు పేరును ప్రాజెక్టుకు పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇదే ప్రథమం. 1986 మే 18 న 84 సంవత్సరాల వయసులో మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం, వెండి ధరలు మళ్లీ తగ్గుముఖం

**హైదరాబాద్, జూన్ 5 :** దేశవ్యాప్తంగా బంగారం ధరల్లో తగ్గుదల కొనసాగుతోంది. గత రెండు రోజులుగా స్వల్పంగా క్షీణిస్తున్న పసిడి ధరలు నేడు కూడా దిగివచ్చాయి. మరోవైపు కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న వెండి ధరలు కూడా నేడు గణనీయంగా తగ్గాయి. దీంతో బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది. బులియన్ మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, నేడు ఉదయం నాటికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.380 తగ్గి రూ.1,55,730కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.350 తగ్గి రూ.1,42,750 వద్ద నమోదైంది. బంగారం ధరల్లో వరుసగా తగ్గుదల కనిపించడం ఇటీవల కాలంలో అరుదుగా మారడంతో కొనుగోలుదారులు మార్కెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. వెండి ధరల్లో కూడా నేడు గణనీయమైన మార్పు కనిపించింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.5,000 తగ్గి రూ.2.80 లక్షలకు చేరుకుంది. విజయవాడ మార్కెట్‌లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు కొనసాగుతున్నట్లు వ్యాపార వర్గాలు వెల్లడించాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,960గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,300గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,750గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,880కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,900గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా విలువైన లోహాల ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 4,444 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి ధర ఔన్స్‌కు 72 డాలర్ల సమీపంలో ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, డాలర్ మారక విలువ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల విధానాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వచ్చే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా ఉంటే బంగారం ధరల్లో మరింత తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ధరల మార్పులను గమనిస్తూ నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ధరలు కొంత తగ్గడం వినియోగదారులకు ఉపశమనం కలిగించే అంశంగా మారింది.

# ఓటీపీ అవసరం లేకుండా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాగిన్

**న్యూఢిల్లీ, జూన్ 5 :** సోషల్ మీడియా వినియోగదారులకు శుభవార్త. సాధారణంగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లలో లాగిన్ కావాలంటే మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విధానం తప్పనిసరిగా అమల్లో ఉంది. అయితే ఇప్పుడు ఓటీపీ అవసరం లేకుండానే లాగిన్ అయ్యే సరికొత్త సదుపాయాన్ని వొడాఫోన్ ఐడియా (వీఐ) తన వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. మెటా భాగస్వామ్యంతో వీఐ ప్రవేశపెట్టిన ఈ కొత్త సాంకేతికత పేరు సైలెంట్ మొబైల్ వెరిఫికేషన్ (ఎస్ఎంవీ). ఈ ఫీచర్ ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లలో లాగిన్ సమయంలో మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా ఆటోమేటిక్ ధృవీకరణ జరుగుతుంది. దీంతో ఓటీపీ కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. వినియోగదారుడి మొబైల్ నంబర్‌ను బ్యాక్‌గ్రౌండ్‌లోనే ధృవీకరించి వేగంగా లాగిన్ ప్రక్రియను పూర్తి చేస్తుంది. ఎస్ఎంవీ అనేది నెట్‌వర్క్ ఆధారిత సురక్షిత ప్రమాణీకరణ సాంకేతికత. ఇందులో వినియోగదారు ఎలాంటి కోడ్ నమోదు చేయాల్సిన అవసరం ఉండదు. యాప్‌ల మధ్య మారడం, ఓటీపీ సందేశం కోసం ఎదురుచూడడం వంటి ఇబ్బందులు కూడా ఉండవు. టెలికాం నెట్‌వర్క్ ద్వారా ధృవీకరణ పూర్తవడంతో లాగిన్ ప్రక్రియ మరింత వేగవంతం, సురక్షితంగా మారుతుంది. కొత్త సిమ్ యాక్టివేషన్, మొబైల్ నంబర్ ధృవీకరణ, యాప్‌లో రీ-లాగిన్, అకౌంట్ పునరుద్ధరణ వంటి సందర్భాల్లో కూడా ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా సిగ్నల్ బలహీనంగా ఉండే ప్రాంతాల్లో ఓటీపీలు ఆలస్యంగా రావడం లేదా అందకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యలకు ఇది పరిష్కారంగా నిలవనుంది. మెటాతో కలిసి ఈ తరహా ఫీచర్‌ను ప్రవేశపెట్టిన తొలి టెలికాం సంస్థగా వీఐ నిలిచింది. భవిష్యత్తులో ఇతర టెలికాం సంస్థలు కూడా ఇదే తరహా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో వినియోగదారులకు మరింత సులభమైన, వేగవంతమైన లాగిన్ అనుభవం లభించే అవకాశం ఉంది.



# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం దిశగా కీలక ముందడుగులు



**వాషింగ్టన్, జూన్ 5 :** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు అత్యంత సన్నిహిత మిత్రుడని పేర్కొన్న ఆయన, ఇరు దేశాల మధ్య త్వరలోనే చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్, భారత్‌తో అమెరికాకు ఉన్న బలమైన సంబంధాలను ప్రస్తావించారు. ప్రధాని మోదీతో తనకు ఎంతో సన్నిహిత అనుబంధం ఉందని, ఇద్దరి మధ్య పరస్పర అవగాహన బలంగా ఉందని చెప్పారు. ఈ సాన్నిహిత్యం కారణంగానే ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలు సానుకూలంగా ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. అయితే గతంలో అమలులో ఉన్న వాణిజ్య విధానాలపై ట్రంప్ కొన్ని విమర్శలు కూడా చేశారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ అధిక దిగుమతి సుంకాలు విధించిందని, ఆ కారణంగా అమెరికా కంపెనీలు భారత మార్కెట్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం పరిస్థితులు మారాయని, ఇరు దేశాలు పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకప్పుడు భారత మార్కెట్లో అధిక సుంకాల కారణంగా ఆ సంస్థకు ఇబ్బందులు ఎదురయ్యాయని, అనంతరం భారతదేశంలోనే కార్యకలాపాలను విస్తరించాల్సి వచ్చిందని వివరించారు. అదే సమయంలో భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో విస్తృత అవకాశాలు లభించాయని చెప్పారు. ఇదిలా ఉండగా, మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు ఇటీవల మరింత వేగం పుంజుకున్నాయి. అమెరికా ప్రతినిధి బృందం భారత్‌లో పలువురు అధికారులతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చలు జరిపింది. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని విస్తరించడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, వ్యాపార అవకాశాలను పెంచడం, మార్కెట్లకు సులభ ప్రవేశం కల్పించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఈ ఏడాది ప్రారంభంలో మోదీ, ట్రంప్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ప్రాథమిక కార్యాచరణ రూపొందించబడినట్లు తెలుస్తోంది. భారత ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న కొన్ని సుంకాలను తగ్గించే అంశం కూడా ఇందులో భాగమైనట్లు సమాచారం. అనంతరం ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పుల కారణంగా చర్చలు కొత్త దిశలో కొనసాగుతున్నాయి. ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ ఒప్పందం కుదిరితే ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ముఖ్యంగా తయారీ రంగం, వ్యవసాయ రంగం, సాంకేతిక రంగం, ఔషధ తయారీ రంగాలకు గణనీయమైన ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది. పెట్టుబడులు పెరగడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా విస్తరించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్, ప్రముఖ ఆర్థిక శక్తిగా ఉన్న అమెరికా మధ్య వాణిజ్య సహకారం మరింత బలపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా సానుకూల ప్రభావం కనిపించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# భారత్‌లోకి గ్రీన్ ఎస్ఎమ్ లిమో

**న్యూఢిల్లీ, జూన్ 5 :** ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల ఆధారిత ప్రయాణ సేవలతో గుర్తింపు పొందిన గ్రీన్ ఎస్ఎమ్ లిమో సంస్థ భారత్‌లో అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది. పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఈ సంస్థ, వియత్నాం, లావోస్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో విజయవంతంగా సేవలు అందించిన అనంతరం తన అంతర్జాతీయ విస్తరణలో భాగంగా భారత మార్కెట్‌లోకి ప్రవేశించింది. పెరుగుతున్న పట్టణీకరణ, కాలుష్య సమస్యలు, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ ఎస్ఎమ్ లిమో పూర్తిగా విద్యుత్ వాహనాల ఆధారిత సేవలను అందిస్తోంది. ఈ సంస్థ ప్రత్యేకత ఏమిటంటే, తన నెట్‌వర్క్‌లో పెట్రోల్ లేదా డీజిల్ వాహనాలకు చోటు లేకుండా వంద శాతం విద్యుత్ వాహనాలనే వినియోగిస్తోంది. దీంతో కార్బన్ ఉద్గారాలు తగ్గించడంలో కీలక పాత్ర పోషించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. భారత్‌లో తొలి దశలో దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో సేవలను ప్రారంభించారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఆధునిక ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు ప్రత్యేకంగా ఏడు సీట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ క్రీడా వినియోగ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారు, విమానాశ్రయాలకు వెళ్లే ప్రయాణికులు, సమూహాలుగా ప్రయాణించే వారికి ఈ సేవలు మరింత ఉపయోగకరంగా ఉండనున్నాయి. భారతీయ వినియోగదారులను ఆకర్షించేందుకు సంస్థ ప్రత్యేక ప్రారంభ ఆఫర్‌ను కూడా ప్రకటించింది. అధికారిక మొబైల్ అనువర్తనం ద్వారా బుక్ చేసుకునే ప్రయాణాలపై యాభై శాతం వరకు రాయితీ కల్పిస్తోంది. ఈ ప్రత్యేక రాయితీ జూన్ 5 నుంచి జూన్ 11 వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. దీంతో ప్రారంభ దశలోనే ఎక్కువ మంది వినియోగదారులను ఆకర్షించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లో విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న సమయంలో గ్రీన్ ఎస్ఎమ్ లిమో ప్రవేశం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యుత్ వాహనాలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఈ రంగంలో పోటీ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు విద్యుత్ ఆధారిత ప్రయాణ సేవలను విస్తరిస్తుండగా, గ్రీన్ ఎస్ఎమ్ లిమో తన అంతర్జాతీయ అనుభవంతో భారత మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు సాధించాలని ప్రయత్నిస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. కాలుష్యాన్ని తగ్గిస్తూ, పరిశుభ్రమైన నగరాల నిర్మాణానికి తోడ్పడే ఈ తరహా సేవలు భవిష్యత్తులో భారత రవాణా రంగంలో కీలక పాత్ర పోషించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# హెక్సాగన్ న్యూట్రిషన్ ఐపీఓకు శ్రీకారం

## పెట్టుబడిదారుల్లో ఆసక్తి

**ముంబై, జూన్ 5:** ఆరోగ్యం, పోషకాహార ఉత్పత్తుల తయారీలో పేరుగాంచిన సంస్థ హెక్సాగన్ న్యూట్రిషన్ తన తొలి పబ్లిక్ ఇష్యూను ప్రారంభించింది. ప్రాథమిక మార్కెట్ ద్వారా సుమారు రూ.138.87 కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు వచ్చింది. పరిశోధన ఆధారిత పోషకాహార ఉత్పత్తులు, సూక్ష్మ పోషక మిశ్రమాల తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ సంస్థ ఐపీఓకు పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఐపీఓ పూర్తిగా ప్రస్తుత వాటాదారుల వాటాల విక్రయం రూపంలోనే మార్కెట్‌లోకి వచ్చింది. మొత్తం 3.09 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచారు. ఒక్కో షేరు ధరను రూ.42 నుంచి రూ.45 మధ్య నిర్ణయించారు. సాధారణ పెట్టుబడిదారులు కనీసం 333 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దాదాపు రూ.14,985 పెట్టుబడి అవసరం అవుతుంది. చిన్న స్థాయి సంస్థాగతేతర పెట్టుబడిదారులు కనీసం 14 లాట్లకు దరఖాస్తు చేయాల్సి ఉండగా, దానికి రూ.2.09 లక్షలకు పైగా పెట్టుబడి అవసరం. పెద్ద స్థాయి పెట్టుబడిదారులు 67 లాట్లకు పైగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారికి దాదాపు రూ.10 లక్షలకు పైగా పెట్టుబడి అవసరమవుతుంది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఐపీఓకు అనధికార మార్కెట్‌లో కూడా మంచి ఆదరణ కనిపిస్తోంది. ప్రస్తుతం ఒక్కో షేరు సుమారు రూ.12 ప్రీమియంతో ట్రేడవుతున్నట్లు తెలుస్తోంది. దీనిని బట్టి షేరు లిస్టింగ్ సమయంలో జారీ ధర కంటే గణనీయంగా అధిక ధర వద్ద నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 1993లో స్థాపించబడిన హెక్సాగన్ న్యూట్రిషన్ ఆరోగ్య, క్లినికల్ పోషకాహార రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. సంస్థ తయారు చేసే ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా సూక్ష్మ పోషక మిశ్రమాలు, బలవర్ధక బియ్యం గింజల తయారీలో సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. భారతదేశంలోని నాసిక్, చెన్నై, తూత్తుకుడి ప్రాంతాల్లో సంస్థ తయారీ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఆర్థిక ఫలితాల పరంగా కూడా సంస్థ గత ఏడాదితో పోలిస్తే మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. సంస్థ మొత్తం ఆదాయం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పెరిగి రూ.331 కోట్లకు చేరుకుంది. నికర లాభం దాదాపు రెట్టింపు కావడం సంస్థ పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. గత ఏడాది రూ.12 కోట్లుగా ఉన్న లాభం తాజా ఆర్థిక సంవత్సరంలో రూ.24 కోట్లకు పైగా పెరగడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. పోషకాహార రంగంలో పెరుగుతున్న డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరిస్తున్న కార్యకలాపాలు, మెరుగైన ఆర్థిక ఫలితాలు వంటి అంశాలు హెక్సాగన్ న్యూట్రిషన్ ఐపీఓపై ఆసక్తిని పెంచుతున్నాయి. దీంతో ఈ ఇష్యూ మార్కెట్లో మంచి స్పందన సాధించే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.






# టీ20 వరల్డ్‌కప్ గెలిపించిన కెప్టెన్‌కు షాక్..?

## సూర్యకుమార్ స్థానంలో శ్రేయస్ అయ్యర్?

**ముంబై, జూన్ 5 :** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత భారత క్రికెట్ వర్గాల్లో ఒక ఆసక్తికర చర్చ మొదలైంది. టీమిండియా టీ20 కెప్టెన్‌గా విజయవంతంగా కొనసాగుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించే అవకాశాలపై వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రచారం ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన తర్వాత టీ20 జట్టు పగ్గాలు చేపట్టిన సూర్యకుమార్ యాదవ్ తన నాయకత్వంతో జట్టుకు వరుస విజయాలు అందించాడు. ఆయన కెప్టెన్సీలో భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను గెలుచుకోవడమే కాకుండా, 2025 ఆసియా కప్ మరియు 2026 టీ20 వరల్డ్‌కప్‌లను కైవసం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో తన ముద్ర వేసింది. ఇలాంటి విజయాల తర్వాత కూడా కెప్టెన్సీ మార్పుపై వార్తలు రావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో కూడా ఐసీసీ ట్రోఫీలు గెలిపించిన కెప్టెన్ల విషయంలో భారత క్రికెట్‌లో ఇలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి. రోహిత్ శర్మ వన్డే జట్టుకు అద్భుత విజయాలు అందించినప్పటికీ, భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా నాయకత్వ బాధ్యతలను యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని టీ20 ఫార్మాట్‌లో కూడా అమలు చేసే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వాన్ని సిద్ధం చేయాలనే లక్ష్యంతో కొత్త కెప్టెన్ ఎంపికపై చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో తన నాయకత్వ ప్రతిభతో ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్ పేరు బలంగా వినిపిస్తోంది. పంజాబ్ కింగ్స్ జట్టును సమర్థవంతంగా నడిపించి విజయాలు అందించిన అయ్యర్, ప్రస్తుతం టీ20 కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు కేవలం ప్రచారంగానే ఉన్నాయి. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేస్తే, అది భారత జట్టు భవిష్యత్ వ్యూహంలో కీలక మార్పుగా భావించబడుతుంది. మరోవైపు వరుస ఐసీసీ ట్రోఫీలు అందించిన కెప్టెన్‌ను మార్చడం సరైన నిర్ణయమేనా అనే అంశంపై అభిమానులు, మాజీ క్రికెటర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చర్చ కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.




# గుకేశ్‌పై ప్రజ్ఞానంద ప్రతీకార విజయం

**ఓస్లో, జూన్ 5 :** నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శనతో టైటిల్ రేసులోకి దూసుకెళ్లాడు. కీలక మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్, భారత స్టార్ చెస్ క్రీడాకారుడు డీ గుకేశ్‌పై సంచలన విజయం సాధించి తన సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో తెలుపు పావులతో ఆడిన ప్రజ్ఞానంద కేవలం 34 ఎత్తుల్లోనే గుకేశ్‌ను ఓడించి అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండు రోజుల క్రితమే తన 20వ పుట్టినరోజు జరుపుకున్న గుకేశ్‌కు ఇది ఊహించని ఎదురుదెబ్బగా మారింది. ఈ విజయానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇదే టోర్నీలో నాలుగో రౌండ్‌లో గుకేశ్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. తాజాగా అదే ప్రత్యర్థిపై గెలిచి ప్రతీకారం తీర్చుకున్నాడు. అంతేకాకుండా వరుసగా మూడు విజయాలు నమోదు చేసి టైటిల్ పోరులో బలమైన పోటీదారుడిగా నిలిచాడు. మ్యాచ్ అనంతరం ప్రజ్ఞానంద మాట్లాడుతూ, "మూడు రోజుల క్రితం వరకు నేను టైటిల్ రేసుకు దూరంగా ఉన్నాను. ఇప్పుడు మళ్లీ పోటీలోకి వచ్చాను. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసం పెరిగింది" అని పేర్కొన్నాడు. గత ఏడాది నార్వే చెస్ టోర్నీలో డీ గుకేశ్, ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ మధ్య పోటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అయితే ఈ ఏడాది కార్ల్‌సన్ ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోవడంతో టైటిల్ పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 15.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి గట్టి పోటీ ఇస్తున్నాడు. మూడో స్థానంలో అలిరెజా ఫిరౌజా 14.5 పాయింట్లతో కొనసాగుతున్నాడు. గుకేశ్ 8 పాయింట్లతో పట్టికలో వెనుకబడి ఉన్నాడు. మిగిలిన రౌండ్లలో కూడా ఇదే జోరు కొనసాగిస్తే ప్రజ్ఞానంద నార్వే చెస్ టైటిల్‌ను కైవసం చేసుకునే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. భారత చెస్ అభిమానులు ఇప్పుడు అతని తదుపరి మ్యాచ్‌లపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అఫ్గానిస్తాన్ టెస్టుకు భారత్ సిద్ధం




**న్యూఢిల్లీ, జూన్ 5 :** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన అనంతరం భారత జట్టు మళ్లీ టెస్టు క్రికెట్‌పై దృష్టి సారించింది. అఫ్గానిస్తాన్‌తో జరగనున్న టెస్టు మ్యాచ్‌కు సంబంధించి జట్టు కూర్పుపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మార్గదర్శకత్వంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు లభించే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు కనబరిచిన శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. టెస్టు క్రికెట్‌లో మళ్లీ ఆధిపత్యం చాటుకోవాలనే లక్ష్యంతో జట్టు సన్నద్ధమవుతోంది.

### ఓపెనింగ్ జోడీగా గిల్-జైస్వాల్

ఈ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్‌ను కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. గిల్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండటంతో అతడే ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జైస్వాల్‌తో కలిసి మంచి ఆరంభం అందిస్తే భారత జట్టుకు భారీ స్కోరు నమోదు చేసే అవకాశం ఉంటుంది.

### మూడో స్థానంలో దేవదత్ పడిక్కల్

ఒకప్పుడు భారత టెస్టు జట్టులో మూడో స్థానానికి ప్రతీకగా నిలిచిన చేతేశ్వర్ పుజారా తర్వాత ఆ స్థానాన్ని స్థిరంగా భర్తీ చేసే ఆటగాడి కోసం జట్టు ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో దేవదత్ పడిక్కల్‌కు అవకాశం దక్కే అవకాశముందని వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ఫామ్ కనబరిచిన పడిక్కల్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టెస్టు జట్టులో తన స్థానాన్ని బలపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

### నాలుగో స్థానంలో కేఎల్ రాహుల్

సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనుభవం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం కారణంగా జట్టు యాజమాన్యం రాహుల్‌పై విశ్వాసం ఉంచినట్లు తెలుస్తోంది. అదే సమయంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఎంపికపై కూడా చర్చ కొనసాగుతోంది. తుది జట్టు ప్రకటన వెలువడిన తర్వాతే ఈ అంశంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. యువ ఆటగాళ్ల, అనుభవజ్ఞుల సమతుల్యతతో అఫ్గానిస్తాన్‌పై విజయమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. అయితే తుది జట్టు వివరాలు అధికారిక ప్రకటన తర్వాతే ఖరారు కానున్నాయి.

# సాయి సుదర్శన్‌కే తొలి ప్రాధాన్యత

## గంభీర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 5 :** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మరోసారి తన స్పష్టమైన అభిప్రాయాలతో వార్తల్లో నిలిచారు. అఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గంభీర్.. టెస్టు జట్టులో మూడో స్థానానికి సాయి సుదర్శన్ కే తొలి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. దేవదత్ పడిక్కల్ కంటే ముందు సుదర్శన్‌కు అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. గంభీర్ మాట్లాడుతూ, "సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదు. అతనికి పూర్తి న్యాయం జరగలేదు. కొద్ది మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం సరైంది కాదు. ఇటీవల ఐపీఎల్‌లో అతను 700కు పైగా పరుగులు చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అందుకే అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి" అని పేర్కొన్నారు.

### శ్రీలంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లు

రాబోయే శ్రీలంక పర్యటన కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గంభీర్ వెల్లడించారు. ఈ పర్యటనకు నలుగురు స్పిన్నర్లను తీసుకెళ్లాలని భావిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నాలుగో స్పిన్నర్ స్థానం కోసం మధ్య పోటీ నెలకొన్నదని తెలిపారు. "అఫ్ఘనిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో వారి ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటాం. ఇద్దరి బౌలింగ్ శైలిలో కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, ప్రత్యేకతలు కూడా ఉన్నాయి" అని గంభీర్ వివరించారు.

### రిషభ్ పంత్‌కు గంభీర్ సూచనలు

టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్ గురించి కూడా గంభీర్ స్పందించారు. పంత్ సహజసిద్ధమైన దూకుడు ఆటను మార్చుకోవాల్సిన అవసరం లేదని, అయితే మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటం నేర్చుకోవాలని సూచించారు. "రిషభ్ పంత్ ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో పరిస్థితులను అర్థం చేసుకుని ఆడటం చాలా ముఖ్యం. ఆటలో మరింత పరిణతి ప్రదర్శించాలి. అతడికి మా పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని గంభీర్ అన్నారు.

### జట్టు భవిష్యత్తుపై దృష్టి

భారత జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని గంభీర్ స్పష్టం చేశారు. అవసరమైతే వన్డే జట్టులో రెగ్యులర్‌గా ఆడే ఆటగాళ్లను కూడా టెస్టు జట్టులోకి తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అఫ్ఘనిస్థాన్‌తో జరిగే టెస్టు మ్యాచ్ ద్వారా పలువురు యువ ఆటగాళ్లు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం పొందనున్నారు. దీంతో తుది జట్టులో ఎవరికీ చోటు దక్కుతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

# శ్రీలంక చేరుకున్న భారత్ 'ఏ' జట్టు..



**దంబుల్లా, జూన్ 5 :** శ్రీలంకలో జరగనున్న ముక్కోణపు వన్డే సిరీస్ కోసం తిలక్ వర్మ సారథ్యంలోని భారత్ 'ఏ' జట్టు లంక గడ్డపై అడుగుపెట్టింది. జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జరగనుంది. ఈ సిరీస్‌లో భారత్ 'ఏ', శ్రీలంక 'ఏ', అఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు పరస్పరం తలపడనున్నాయి. భవి ష్యత్ భారత జట్టుకు ఎంపికయ్యే అవకాశమున్న యువ ఆటగాళ్ల ప్రతిభను పరీక్షించే వేదికగా ఈ టోర్నీ నిలవనుంది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఈ టోర్నీలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన వైభవ్‌పై అభిమానులతో పాటు సెలెక్టర్ల దృష్టి కూడా కేంద్రీకృతమైంది. భారత్ 'ఏ' జట్టు శ్రీలంక చేరుకున్న విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, వైభవ్ సూర్యవంశీ తదితర ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్న ఫొటోలను పంచుకుంది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నీలో భారత యువ ఆటగాళ్లు తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. ఈ పర్యటనకు ముందు భారత జట్టులో రెండు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. తొడ కండరాల గాయంతో రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ప్రస్తుతం రియాన్ పరాగ్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు హర్ష్ దూబేకు భారత సీనియర్ జట్టు నుంచి పిలుపు రావడంతో అతని స్థానంలో అనుకుల్ రాయ్‌ను జట్టులోకి ఎంపిక చేశారు.

### భారత్ 'ఏ' జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచే ఆటగాళ్లకు త్వరలోనే భారత సీనియర్ జట్టులో అవకాశాలు లభించే అవకాశం ఉండటంతో ప్రతి మ్యాచ్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ ప్రదర్శనలపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెర్బియాపై మెక్సికో ఘన విజయం

**మెక్సికో సిటీ, జూన్ 5 :** ఫీఫా ప్రపంచకప్-2026 సన్నాహక మ్యాచ్‌లో మెక్సికో జట్టు అద్భుత ప్రదర్శనతో సెర్బియాపై 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. సొంత మైదానంలో అభిమానుల మద్దతుతో బరిలోకి దిగిన మెక్సికో, ప్రారంభంలో వెనుకబడినప్పటికీ ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి విజయం ఖాయం చేసుకుంది. మ్యాచ్ 19వ నిమిషంలో సెర్బియా ఆటగాడు పెటార్ స్టానిక్ గోల్ నమోదు చేసి తన జట్టుకు ఆధిక్యం అందించాడు. అయితే మెక్సికో ఆటగాళ్లు ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా దూకుడుగా ఆడారు. 34వ నిమిషంలో జోహాన్ వాస్క్వెజ్ అద్భుత హెడర్‌తో గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. మొదటి అర్ధభాగం ముగిసే సమయానికి సెర్బియా ఆటగాళ్ల పొరపాటు మెక్సికోకు వరంగా మారింది. సెల్ఫ్ గోల్ కారణంగా మెక్సికో 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ గోల్ మ్యాచ్ మలుపు తిప్పిన కీలక ఘట్టంగా నిలిచింది. రెండో అర్ధభాగంలో మెక్సికో మరింత దూకుడుగా ఆడింది. 57వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ గోల్ చేసి ఆధిక్యాన్ని 3-1కు పెంచాడు. అనంతరం 72వ నిమిషంలో సెర్బియా మరోసారి సెల్ఫ్ గోల్ చేసుకోవడంతో స్కోరు 4-1గా మారింది. మ్యాచ్ చివరి దశలో లూయిస్ చావెజ్ అద్భుతమైన లాంగ్ రేంజ్ షాట్‌తో మరో గోల్ సాధించి మెక్సికో విజయంలో తన ముద్ర వేశాడు. దీంతో మెక్సికో 5-1 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రౌల్ జిమెనెజ్, జోహాన్ వాస్క్వెజ్, లూయిస్ చావెజ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా డిఫెన్స్, మిడ్‌ఫీల్డ్, ఫార్వర్డ్ లైన్ల మధ్య సమన్వయం మెక్సికో విజయానికి ప్రధాన కారణమైంది. ప్రపంచకప్ ప్రారంభానికి ముందు ఇలాంటి భారీ విజయం సాధించడం మెక్సికో జట్టుకు పెద్ద ఊరటనిచ్చింది. ప్రధాన కోచ్ జేవియర్ అగ్యిరే ఆధ్వర్యంలో జట్టు మంచి లయలో ఉందని ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనున్న మెక్సికో జట్టు ఈ విజయంతో మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.






# పెద్ది బాక్సాఫ్ కలెక్షన్ల సునామీ

## తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు

## బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల

ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

# పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

## సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్ జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ .135 కోట్లు వసూలు చేసింది.





# 'దూత 2' ప్రారంభం..

## ఓదెల-2పై శర్వానంద్ ఆసక్తికర కామెంట్స్

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దూత' వెబ్ సిరీస్ రెండో భాగం అధికారికంగా ప్రారంభమైంది. తొలి భాగంతో విశేష ఆదరణ పొందిన ఈ అతీంద్రియ ఉత్కంఠభరిత కథా ధారావాహికకు కొనసాగింపుగా రూపొందుతున్న 'దూత 2' పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'దూత' తొలి భాగం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉత్కంఠభరిత కథనం, అనూహ్య మలుపులు, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సిరీస్‌కు ఇప్పుడు రెండో భాగం రూపుదిద్దుకోవడం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. మొదటి భాగం ముగిసిన తీరు చూసిన ప్రేక్షకులు తదుపరి కథ ఎలా ఉండబోతోందనే ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ సిరీస్ ద్వారా అక్కినేని నాగచైతన్య తన సినీ ప్రయాణంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు. నటుడిగా ఇప్పటికే గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు నిర్మాతగా కూడా బాధ్యతలు చేపట్టడం విశేషంగా మారింది. అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు ప్రముఖ నిర్మాత శరత్ మరార్ సంస్థతో కలిసి నాగచైతన్య ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. నిర్మాతగా తన తొలి అడుగు 'దూత 2'తో పడుతుండటం తనకు ఎంతో ఆనందంగా ఉందని నాగచైతన్య పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నాగచైతన్య, 'దూత' రెండో అధ్యాయం ప్రారంభమవుతున్న ఈ సందర్భంగా తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతి కలుగుతోందన్నారు. నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని, ప్రేక్షకులకు మరింత మెరుగైన కథను అందించేందుకు బృందం కృషి చేస్తోందని తెలిపారు. మొదటి భాగాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ఈసారి మరింత ఉత్కంఠ, వినోదం అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మొదటి భాగానికి దర్శకత్వం వహించి ప్రశంసలు అందుకున్న దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ రెండో భాగానికీ దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథనం, పాత్రల రూపకల్పన, ఉత్కంఠభరిత మలుపులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన నుంచి మరోసారి ఆసక్తికరమైన కథనం రాబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి భాగంలో కీలక పాత్రలు పోషించిన పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ ఈ సీక్వెల్‌లో కూడా తమ పాత్రలను కొనసాగిస్తున్నారు. వీరితో పాటు మరికొంతమంది ప్రముఖ నటీనటులు కూడా ఈ సిరీస్‌లో కనిపించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే వారి వివరాలను చిత్రబృందం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈ సిరీస్‌కు ఇషాన్ ఛాబ్రా సంగీతం అందిస్తుండగా, ముఖేష్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిర్మాణ పర్యవేక్షణలో పద్మాకర్, ప్రవళ్య, అనూష పుంజాల తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. సాంకేతికంగా మరింత ఉన్నత ప్రమాణాలతో రెండో భాగాన్ని రూపొందించేందుకు బృందం సన్నాహాలు చేస్తోంది. తొలి భాగం సాధించిన విజయాన్ని దృష్టిలో ఉంచుకుని 'దూత 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కథలో కొత్త మలుపులు, మరింత ఉత్కంఠభరితమైన సంఘటనలు, బలమైన పాత్రలతో ఈ సిరీస్ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది. అక్కినేని అభిమానులతో పాటు వెబ్ సిరీస్‌లను ఆసక్తిగా వీక్షించే ప్రేక్షకులు కూడా 'దూత 2' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# షార్ట్ ఫిల్మ్‌ల నుంచి వెండితెరకు..

## ప్రియాంక జవాల్కర్ ప్రయాణం



హైదరాబాద్, జూన్ 5 :సినీ పరిశ్రమలో అవకాశాల కోసం ఎన్నో కలలతో అడుగుపెట్టే యువతుల్లో కొందరే తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తారు. అలాంటి వారిలో నటి ప్రియాంక జవాల్కర్ ఒకరు. షార్ట్ ఫిల్మ్‌లతో తన నటనా ప్రతిభను నిరూపించుకుని, అనంతరం తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికగా అవకాశాలు అందుకుని ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. సినిమాల్లోకి రాకముందు ప్రియాంక జవాల్కర్ అనేక షార్ట్ ఫిల్మ్‌లలో నటించారు. తన సహజమైన నటన, ఆకట్టుకునే అభినయంతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించారు. ఈ క్రమంలో ఆమెకు తెలుగు సినిమాల్లో అవకాశాలు రావడం ప్రారంభమైంది. తొలి అవకాశంతోనే ప్రముఖ హీరో సరసన నటించే అవకాశం దక్కడం ఆమె సినీ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది. విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన టాక్సీవాలా చిత్రంలో కథానాయికగా నటించిన ప్రియాంక జవాల్కర్ మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఈ చిత్రం వాణిజ్యపరంగా విజయవంతం కావడంతో పాటు ప్రియాంకకు నటిగా మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఆమె అందం, అభినయం, తెరపై కనిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో వరుస అవకాశాలు లభించాయి. ఆ తర్వాత తిమ్మరుసు, ఎస్ఆర్ కళ్యాణమండపం, గమనం వంటి చిత్రాల్లో నటించి తన నటనతో మెప్పించారు. ముఖ్యంగా ఎస్ఆర్ కళ్యాణమండపం చిత్రం విజయంతో ఆమెకు మరింత గుర్తింపు లభించింది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకునేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం పెద్దగా సినిమాల్లో కనిపించకపోయినా, ప్రియాంక జవాల్కర్ సామాజిక మాధ్యమాల్లో మాత్రం చురుకుగా ఉంటున్నారు. తరచూ ఫొటోలు, వ్యక్తిగత విషయాలు, ఫ్యాషన్‌కు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో మంచి ఆదరణ పొందుతున్నారు. ఆమె పంచుకునే చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో అవకాశాల కోసం షార్ట్ ఫిల్మ్‌లను వేదికగా చేసుకుని విజయవంతమైన నటిగా ఎదిగిన ప్రియాంక జవాల్కర్, భవిష్యత్తులో మరిన్ని మంచి కథలతో ప్రేక్షకుల ముందుకు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. సరైన కథలు, పాత్రల కోసం ఎదురుచూస్తున్న ఆమె మరోసారి విజయవంతమైన చిత్రంతో తెరపై సందడి చేయాలని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com